
Follow: @ANNTELUGU
10-12-2024
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 10 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాజ్యసభ చైర్మన్ పై అవిశ్వాసం

### ఇండియా కూటమి సంచలన నిర్ణయం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు విపక్షాల నిరసనలతో అట్టుడుకుతున్నాయి. రాజ్యసభ చైర్మన్ జగ్ దీప్ ధన్ కర్ విషయంలో విపక్షాలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నాయి. దీంతో ధన్ కర్ పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రధాన విపక్షం కాంగ్రెస్ పార్టీతో రాజ్యసభ చైర్మన్ జగ్ దీప్ ధన్ కర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టించి తాము మద్దతివ్వడమా లేక ఇండియా కూటమి అంతా ఏకమై ఈ అవిశ్వాస తీర్మానం పెట్టాలా అన్న దానిపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభ చైర్మన్ గా ఉంటూ అధికార పక్షానికి వంత పాడుతున్నారనేది ధన్ కర్ పై ప్రధాన అభియోగం. దీనిపై పలుమార్లు ఆయన్ను కలిసి చర్చించినా ఫలితం లేకపోవడంతో అవిశ్వాసం పెట్టి తీరాలని విపక్షాలు భావిస్తున్నాయి.

సారు.. రారు

## కేసీఆర్ మళ్లీ డుమ్మా



- రేవంత్ అప్పీల్ చేసిన రాని ప్రతిపక్ష నేత
- రాష్ట్రవ్యాప్తంగా జోరుగా చర్చ

02

కేజ్రీ.. ఆగరు

## కేజ్రీవాల్ దూకుడు



- ఢిల్లీ ఎన్నికలకు రెండో జాబితా ప్రకటన
- 20 మంది అభ్యర్థులతో రెండోజాబితా

05

కమలం.. ఖరారు

## బీజేపీ కృష్ణయ్య



- రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటన
- నేడు నామినేషన్
- ఏపీలో తన స్థానంలో తానే


03



## సోనియాకు ఖర్గే శుభాకాంక్షలు

### తెలంగాణలో ఘనంగా జన్మదిన వేడుకలు

**మహా:** ఏఐసీసీ అధినేత సోనియా గాంధీ సోనియా గాంధీ జన్మదిన వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పార్టీ అధ్యక్షుడు ఖర్గేతో పాటు సీఎం రేవంత్, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.



## ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

### నియమించిన కేంద్రం

**మహా:** సంజయ్ మల్హోత్రాను రిజర్వ్ బ్యాంక్ 26వ గవర్నర్గా కేంద్రం నియమించింది. ఆయన ఇప్పటివరకు రెవెన్యూ కార్యదర్శిగా సేవలందించారు.

వివరాలు 2లో





# చరిత్రలో నిలిచేలా..

## సచివాలయంలో.. తెలంగాణ తల్లి

### విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం
- జయజయహే తెలంగాణ, టీజీ తెలంగాణ ఉద్యమ చిహ్నాలు
- ఒక్క కుటుంబం కోసం కాదు.. నాలుగుకోట్ల ప్రజల కోసం తెలంగాణ
- ఆవిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అందేశ్రీ, గోరటి, జయరాజు సహా 9మందికి రూ.కోటి చొప్పున నజరానా ప్రకటన
- కనులపండుగగా.. డ్రోన్ షో..ఆకాశంలో ఉద్యమ స్మృతులు..
- సోనియాకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుకున్నది సాధించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో చిరస్మరణీయఘట్టమైన డిసెంబర్ 9నే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసి.. సోమవారం ఆవిష్కరించారు. 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

మిగతా 2లో

## మోహన్ బాబు ఫ్యామిలీలో.. ఆస్తి పంచాయతీ



- నా ఇంటిని ఆక్రమించుకున్నారు
- మనోజ్ నుండి ప్రాణహాని ఉంది – మోహన్ బాబు ఫిర్యాదు
- నాపై దాడి చేశారు.. రక్షణ ప్లీజ్ – మనోజ్

05

## 2027లో ఒకే దేశం ఒకే ఎన్నికలు

### పార్లమెంటు ముందుకు జమిలి ఎన్నికల బిల్లు

2027లో దేశంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వేగంగా పావులు కదుపుతోంది. జమిలి ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే బిల్లు రూపొందినట్లు బీజేపీ వర్గాల నుంచి తెలుస్తోంది. 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. - మహా, హైదరాబాద్




వివరాలు 3లో

## సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల పర్యటన

- డిసెంబర్ 11 నుంచి 13 వరకు ఇతర రాష్ట్రాల్లో సీఎం పర్యటన
- మొదటి రోజు జైపూర్‌లో, ఆ తర్వాత ఢిల్లీలో పర్యటించనున్న సీఎం
- సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు వెళ్లే అవకాశం

03



## విధ్వంసం నుంచి వికాసం దిశగా

### ఖాళీ ఖజానా చేతికి ఇచ్చిన గత ప్రభుత్వం

- భట్టి విక్రమార్క చేతిలో ఖజానా పదిలం
- ఆర్థికశాఖను గాడిలో పెట్టిన భట్టి
- ఆరు హామీల అమలులో భట్టి కీలక పాత్ర

03



## ఉద్రిక్తం.. ఆశావర్కర్ల ఆందోళన

### సీఐపై చేయిచేసుకున్న ఆశావర్కర్.. ఎగిరెగిరి కొట్టిన పోలీసులు..

### చీరపట్టి, చేయిపట్టి లాగుతూ ఏసీపీ దురుసు ప్రవర్తన

**హైదరాబాద్, మహా:** ఓవైపు.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగా మరోవైపు.. బీఆఎస్ నేతల ఆందోళనలు, ఇదే క్రమంలోనే ఆశావర్కర్ల నిరసనలతో హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. కోఠిలోని డీఎంఈ కార్యాలయం గేటు ముందు ఆశావర్కర్లు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. ఆశావర్కర్లు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. ఆశావర్కర్లను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశావర్కర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో.. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆశాలను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి విషమించడంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేశారు. దీంతో డీఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మిగతా 2లో

## అసెంబ్లీలో దుమారం

### మంత్రి కుర్చీలో బీజేపీ ఎమ్మెల్యే

## ప్రోటోకాల్‌పై శాసనసభలో నిరసన

### ఇది ప్రోటోకాల్ ఉల్లంఘన మంత్రి తుమ్మల

- చర్చకు పట్టుబట్టిన బీజేపీ ఎమ్మెల్యేలు
- ట్రాక్టర్ పై అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ శాసనసభ సమావేశాల తొలిరోజు వాడివేడిగా సాగాయి. ప్రోటోకాల్ అంశంపై బీజేపీ, కాంగ్రెస్ శాసనసభ్యుల మధ్య మాటల యుద్ధం సాగింది. సభ ప్రారంభంకాగానే కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి అసెంబ్లీలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీటులో కూర్చున్నారు.

మిగతా 2లో

## తెలంగాణ తల్లి అంటే భావన కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం

### సెప్టెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం

### అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** ప్రతి ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసన సభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ప్రాచుర్యంలో ఉన్న విగ్రహానికి అధికారిక గుర్తింపు లేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా తెలంగాణ తల్లి విగ్రహ ప్రత్యేకతలను సీఎం సభకు వివరించారు. స్వరాష్ట్ర సాధన సుదీర్ఘ పోరాటంలో సకల జనుల్లో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లిని అధికారికంగా గౌరవించుకుంటున్నామని చెప్పారు.

**వారే స్ఫూర్తి**

స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి అన్న ఆయన తెలంగాణ

మిగతా 2లో

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,780 |
| 22 క్యారెట్ | 71,300 |
| సిల్వర్ (కేజీ) | 92,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,508.46 |
| నిఫ్టీ ↗ | 24,619 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6.2 | 186 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6.2 | 186 |
| రిటైల్ గుడ్డు ధర | 6.4 | 192 |

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM

జనరల్ వార్తలు | GENERAL NEWS

మంగళవారం, హైదరాబాద్ | 10-12-2024

ANN తెలుగు

# ఉద్రిక్తం.. ఆశావర్కర్ల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలోనే.. ఆశావర్కర్ల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మహిళా పోలీసులతో పాటు మగ పోలీసులు కూడా చేరి.. ఆశాలను వ్యాన్ల లోకి లాగి పడేశారు. అందులోనూ.. ఏసీపీ శంకర్ మరీ ఎక్కువ అత్యుత్సాహం ప్రదర్శించారు. అక్కడ మహిళా కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ.. ఆశావర్కర్లను లాగేసేందుకు ఎక్కువ ఉత్సాహం కనబరిచారు ఏసీపీ శంకర్. మహిళను చేతులు పట్టి లాగటం, పట్టిలాగేయ్యాడంటూ మహిళా కానిస్టేబుళ్లను ఆదేశించటం.. ఈ క్రమంలో ఆ కానిస్టేబుళ్లను కూడా ఇష్టమున్నట్టు మోచేతులతో తోసేయ్యటం, ఎక్కడెక్కడో తాకటం లాంటి పనులు చేసిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే.. ఏసీపీ శంకర్ మీదికి ఆశావర్కర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



### సిఐపై దాడి

మరోవైపు.. ఓ ఆశావర్కర్‌ను వ్యాన్ ఎక్కించి డోర్ వేస్తున్న సమయంలో.. ఆమె సుల్తాన్ బజార్ సీఐ శ్రీనివాస్ చారిపై చేయి చేసుకుంది. సీఐ చెంప చెల్లుమనిపించటాన్ని గుర్తించిన.. పోలీసులు ఆశావర్కర్‌పైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట మహిళా కానిస్టేబుళ్లు ఎగిరి మరీ ఆమెపై చేయి చేసుకోగా.. పురుష కానిస్టేబుళ్లు కూడా ఆమెను కొట్టేందుకు ఉత్సాహం చూపించారు. ఇదే గ్యాప్‌లో ఏసీపీ శంకర్ సైతం మరింత ఉత్సాహం చూపించారు. ఎగిరి మరీ ఆ ఆశావర్కర్ చీరపట్టి లాగారు. దీంతో.. వ్యాన్‌లో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్ వారించి.. చీరను సరి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇంతకూ ఆ ఆశావర్కర్ ఎందుకు చేయి చేసుకుందని ఆరా తీస్తే.. వ్యాన్‌లో ఎక్కించినప్పుడు పురుష పోలీసులు తనను అసభ్యకరంగా తాకారని.. పైగా వ్యాన్‌లోకి తోసేసి డోర్ వేస్తున్న సమయంలో తన కాలు అందులో ఇరుక్కుందని ఎంత చెప్పినా వినిపించుకోలేదని.. అందుకే కోపంతో తాను చేయి లేపానని.. ఆ ఆశావర్కర్ వివరణ ఇచ్చారు. అంతేకాకుండా.. సీఐ శ్రీనివాస్ చారీ పరుష పదజాలంతో తిట్టారంటూ ఆశావర్కర్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ తోపులాటలో ఓ ఆశావర్కర్ స్పృహతప్పి పడిపోయింది. అయినా సరే.. ఆమెను ఏమాత్రం పట్టించుకోకుండా మహిళా కానిస్టేబుళ్లు, పురుషకానిస్టేబుళ్లు, ఉన్నత స్థాయి పోలీసులు కూడా ఆమె పక్కనుంచే వెళ్తూ.. మిగతా ఆశావర్కర్ల పైన తమ ప్రతాపం చూపించే ప్రయత్నం చేయటం శోచనీయమని.. పలువురు మహిళలు వాపోతున్నారు. చాలాసేపటివరకు ఆమెను పట్టించుకోకుండానే ఉన్నారని.. ఎంతసేపటికీ కళ్లు తెరవకపోవటంతో మిగతా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. అప్పుడు అంబులెన్సులో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## మంత్రి కుర్చీలో బీజేపీ ఎమ్మెల్యే

# ప్రొటోకాల్‌పై శాసనసభలో నిరసన

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని గుర్తించిన మరోమంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇది ప్రోటోకాల్ ఉల్లంఘన కిందకు వస్తుందని, మీకు ఏదైనా సమస్య ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యేలకు గౌరవం లేకుండా పోయిందని అందుకే తాను నిరసన తెలిపేందుకు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి స్థానంలో కూర్చున్నట్లు తెలిపారు. ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహంపై చర్చ ఉన్న నేపథ్యంలో రేపు ఈ విషయంపై చర్చిద్దామని మంత్రులు వెంకటరమణారెడ్డికి సూచించగా.. బీజేపీ సభ్యులు ఈరోజు చర్చ జరగాలని పట్టుబట్టారు. జనగణమన తర్వాత ఈ విషయంపై చర్చిద్దామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పగా.. బీజేపీ శాసనసభ్యుడు వెంకటరమణారెడ్డి తన స్థానంలో కూర్చున్నారు. ఆ తర్వాత ఈ విషయంపై సభ్యులు తమ సీట్ల వద్ద నుంచి నిరసన తెలపడంతో పాటు మంత్రులు, ఇతర సభ్యులు ప్రసంగిస్తుండగా కొంత అంతరాయం కలిగించే ప్రయత్నం చేయగా స్పీకర్ వారించే ప్రయత్నం చేశారు. మొదటిసారి శాసనసభకు వచ్చిన సభ్యులు నేర్చుకోవాలని, పద్ధతిగా వ్యవహరించాలని సూచించారు. దీనిపై సంతృప్తి చెందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఈ విషయంపై చర్చకోసం పట్టుబట్టారు.

**చర్చించాల్సిందే..**

ప్రొటోకాల్ విషయంపై కాటిపల్లి వెంకటరమణారెడ్డి శాసనసభలో మాట్లాడుతూ.. తన గౌరవం గురించి శాసనసభలో ప్రస్తావించడం లేదని, ఎమ్మెల్యేల గౌరవం అంశాన్ని తాను ప్రస్తావిస్తున్నట్లు తెలిపారు. ఇవాళ తాను ఎమ్మెల్యేగా ఉన్నానని, రేపు మరోవ్యక్తి అదేస్థానంలో ఉండొచ్చని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యే స్థానానికి గౌవరం ఇవ్వాలనే అంశంపై తాను మాట్లాడుతున్నట్లు తెలిపారు. తాను ఎన్నికల్లో గతంలో ఓడిపోయి ఉండొచ్చని, 25 ఏళ్లకు పైగా తనకు రాజకీయ అనుభవం ఉందన్నారు. తనకు అనుభవం ఉందని, రేపు తప్పనిసరిగా శాసనసభలో ఈ అంశంపై రేపు చర్చకు అవకాశం కల్పించాలన్నారు. లేకపోతే తాము ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.

**ట్రాక్టర్ పై అసెంబ్లీకి**

బీజేపీ ఎమ్మెల్యేలు ట్రాక్టర్ పై అసెంబ్లీకి వచ్చారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్వయంగా ట్రాక్టర్ నడపగా, ముథోల్ ఎమ్మెల్యే రామారావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ కూడా ట్రాక్టర్ పై ఎక్కి అసెంబ్లీకి వచ్చారు.

# తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

## పోలీసుల కౌంటర్ అఫిడవిట్.. వెలుగులోకి కీలక విషయాలు

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గత కొంత కాలంగా రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సహా, పలువురు నేతలు, వ్యాపారుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా ఈ కేసులో పోలీసులు కోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ఆరో నిందితుడు ఎండీ శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌కు కౌంటర్‌గా వేసిన అఫిడవిట్‌లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. అఫిడవిట్ లో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, న్యూస్‌ఛానెల్ ఎండీ శ్రవణ్‌రావులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. వీరు ఎస్ఐబీ ఆఫీస్, బేగంపేటలోని హరితప్లాజా హోటల్, మారిగోల్డ్ హోటల్, జూబ్లీహిల్స్‌లోని శ్రవణ్‌రావు ఇంట్లో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు శ్రవణ్‌రావు నియోజకవర్గాల వారీగా చేయించిన రాజకీయ సర్వేలో బీఆర్ఎస్ పార్టీకి 50 సీట్లు దాటే పరిస్థితి లేదని తేలింది. ఇదే విషయాన్ని ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుతో జరిగిన సమావేశంలో వెల్లడించారు.




దీంతో వ్యాపారవేత్తలు, బిల్డర్ల నుంచి బీఆర్ఎస్ ప్రత్యర్థులకు పంపే డబ్బుపై ఫోకస్ పెట్టారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో అలాంటి సంస్థలను గుర్తించి నిఘా పెంచారు. ఇన్ని ప్రయత్నాలు చేసినా ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. దీంతో ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు (మాజీ డీఎస్పీ) ఎస్ఐబీ డేటాను విధ్వంసం చేయాలనే కుట్ర పన్నారు. ఇదే విషయాన్ని రాధాకిషన్‌రావు, భుజంగరావు, శ్రవణ్‌రావులకు తెలిపారు. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్‌ను (వీవోఐపీ) వినియోగించుకొని వాట్సప్ సంభాషణల హిస్టరీ, ఇతర యాప్స్, గ్యాలరీల్లోని ఇమేజ్‌లు, వీడియోలు తొలగించారు. తమ ఫోన్లను, ట్యాబ్‌లను, పర్సనల్ ల్యాప్‌టాప్‌లను ఫార్మాట్ చేశారు. ఎస్ఐబీలోని హార్డ్‌డిస్క్‌లను, పెన్‌డ్రైవ్‌లను, డాక్యుమెంట్లను, డైరీలను, ప్రింట్ అవుట్లను ధ్వంసం చేయడంపైనా ఫోకస్ పెట్టారు. ప్రణీత్‌రావు మూసీ నదిలో పడేసిన హార్డ్‌డిస్క్‌లు గతంలో ఎస్ఐబీలో వినియోగించినవేనని కోర్టుకు తెలిపారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) విశ్లేషణలో ఈ మేరకు తేలింది. మూసీ నదిలో దొరికిన హార్డ్ డిస్క్ సీరియల్ నంబర్ల ఆధారంగా ఇవి ఎస్ఐబీకి చెందినవే అని నిర్ధారించామని పోలీసులు కోర్టుకు సమర్పించిన అఫిడవిట్ లో పేర్కొన్నారు.

మొత్తం మీద ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఆషామాషిగా సాగలేదని, వ్యూహాత్మకంగా ప్రత్యర్థులను బలంగా దెబ్బ తీయాలన్న సంకల్పంతో ప్రభుత్వ వ్యవస్థలను తప్పుదారి పట్టించేలా గత పాలకులు తమకున్న అధికారాన్ని పూర్తి స్థా.ిలో దుర్విని.యోగం చేశారన్న విషయం స్పష్టం కావడంతో ఈ కేసు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో, ఎప్పటికి కేసు దర్యాప్తు కొలిక్కి వస్తుదో తెలియ.ని పరిస్థితి నెలకొంది.



## ఏపీ రాజ్యసభ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యను ప్రకటించిన బీజేపీ

**మహా:** వైసీపీని వీడి బీజేపీలో చేరిన మాజీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు ఆ పార్టీ సముచిత గౌరవాన్ని ఇచ్చింది. ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా కృష్ణయ్యను బీజేపీ ప్రకటించింది. గతంలో ఆయన వైసీపీ తరపున రాజ్యసభకు వెళ్లారు. ఎన్నికల తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీకి ఆయన రాజీనామా చేశారు. మరోవైపు హర్యానా నుంచి రేఖాశర్మను, ఒడిశా నుంచి సుజిత్ కుమార్ ను రాజ్యసభ అభ్యర్థులుగా బీజేపీ నాయకత్వం ఎంపిక చేసింది.

## తెలంగాణ తల్లి అంటే భావన కాదు..

# 4 కోట్ల బిడ్డల భావోద్వేగం

(మొదటిపేజీ తరువాయి)

జాతికి జీవం పోసిందని తెలిపారు. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదని రూ.4కోట్ల బిడ్డల భావోద్వేగం అని సీఎం చెప్పారు. భావోద్వేగాన్ని ప్రతిబింబించేలా ప్రజాప్రభుత్వం తెలంగాణ తల్లిని రూపొందించిందని వివరించారు. ప్రశాంత వదనంతో నిండైన రూపంతో చాకలి ఐలమ్మ, సారలమ్మ పోరాట స్ఫూర్తి కనిపించేలా హుందాతో కనిపించేలా విగ్రహం రూపొందించినట్టు చెప్పారు.

తెలంగాణ తల్లి రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులు పరిగణలోకి తీసుకున్నామని, ప్రశాంత వదనంతో సాంప్రదాయ కట్టుబొట్టుతో, గుండు పూసలు, హారం, ముక్కుపుడకతో, ఆకుపచ్చ చీర , కడియాలు, మెట్టెలతో తెలంగాణ తల్లి రూపకల్పన చేసినట్లు వివరించారు. తెలంగాణ అస్తిత్వాన్ని తెలిపేలా చేతిలో తెలంగాణ పంటలతో కనిపిస్తుందన్నారు. తెలంగాణ తల్లి నిల్చున్న పీఠం చరిత్రకు దర్పణంగా నిలుస్తుందని సీఎం వివరించారు.

### సాంస్కృతి పురుజ్జీవం

ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను విగ్రహాన్ని రూపొందించినట్లు తెలిపారు. విగ్రహంలో వాడిన ఒక్కో రంగు ప్రత్యేకతను చెప్పిన సీఎం తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ సంక్షిప్త పేరును టీజీకి అధికారిక గుర్తింపు ఇచ్చామని తెలంగాణ ఆత్మగౌరవాన్ని నలుదిశలా వ్యాప్తి చేసిన జననీ జయ జయహేను రాష్ట్ర అధికార గీతంగా ప్రకటించామని సీఎం చెప్పారు.



## కేసీఆర్ మళ్లీ డుమ్మా

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రోజురోజుకూ భగ్గుమనేలా విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా.. ప్రధాన ప్రతిపక్ష నేత పాత్ర పోషించాల్సిన కేసీఆర్ మరోసారి డుమ్మా కొట్టారు. ఇప్పుడు దీనిపై రాష్ట్రవ్యాప్తంగా మరోసారి చర్చకు దారితీసింది. ప్రజాతీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్రను పోషించాల్సిన బీఆర్ఎస్ అధినేత, మాజీముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా ఫాంహౌజ్‌కే పరిమితం అవుతున్నారు. ఇప్పటికే చాలా సందర్భాల్లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అప్పీల్ చేశారు. సీనియర్ నాయకుడైన మీరు అసెంబ్లీకి వచ్చి తమకు సూచనలు ఇవ్వాలని.. తమ పాలనను ముందుకు నడిపించాలని కోరారు. విలువైన సూచనలతో ప్రజల సమస్యలను మరింత దూరం చేయొచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీ రండి.. వచ్చి మమ్మల్ని ఇరుకున పెట్టండి.. నిలదీయండి అని కూడా కోరారు. కానీ.. కేసీఆర్ మాత్రం ఎప్పటిలాగే.. ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాల్లో కనిపించలేదు.

# హైదరాబాద్ మెట్రో కొత్తస్టేషన్లు ఫైనల్

## సెకండ్ ఫేజ్ కు రైట్ రైట్



**హైదరాబాద్, మహా:** మెట్రోకు ఆదరణ పెరుగుతుండటంతో తెలంగాణ ప్రభుత్వం రెండో దశను ప్రాతిపాదించింది. కారిడార్ 4లో భాగంగా నాగోల్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు, కారిడార్ 5లో రాయదుర్గం కోకాపేట్ నియోపోలిస్ వరకు, కారిడార్ 6లో ఎంజీబీఎస్ - చంద్రాయణగుట్ట వరకు, కారిడార్ 7లో మియాపూర్ - పటాన్‌చెరు వరకు, కారిడార్ 8లో ఎల్‌బీనగర్ - హయత్‌నగర్ వరకు, కారిడార్ 9లో ఎయిర్‌పోర్టు - ఫోర్త్ సిటీ వరకు మెట్రో నిర్మిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ నెలరోజుల క్రితమే కేంద్రానికి చేరగా.. అక్కడి నుంచి ఆమోదం రాగానే వెంటనే పనులు ప్రారంభించనున్నారు. మెట్రో ప్రాజెక్టులో భాగంగా స్థానిక పేర్లతోనే మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. చారిత్రక ప్రదేశాల ప్రత్యేకతను కాపాడేందుకే వాటి పేర్లతోనే స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అయితే ఈ స్టేషన్లపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**నాగోల్–ఎయిర్‌పోర్టు మార్గం ప్రాతిపాదిత స్టేషన్లు**


నాగోలు, నాగోల్ క్రాస్‌రోడ్డు, అల్కాపురి జంక్షన్, కామినేని హాస్పిటల్, ఎల్‌బీనగర్, బైరామల్‌గూడ, మైత్రినగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట్ రోడ్డు, ఓవైసీ హాస్పిటల్, డీఆర్‌డీవో కంచన్‌బాగ్, బాలాపూర్ రోడ్డు, చాంద్రాయణగుట్ట ( ఇక్కడ ఇంటర్‌ఛేంజ్), బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, అరాంఘర్, న్యూ హైకోర్టు, గగన్‌పహాడ్, సాతంరాయ్, సిద్ధాంతి, శంషాబాద్, ఎయిర్‌పోర్టు కార్గో, ఎయిర్‌పోర్టు టెర్మినల్ స్టేషన్లు ఉన్నాయి.

**ఎల్‌బీనగర్–హయత్‌నగర్ ప్రతిపాదిత స్టేషన్లు..**

చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, లెక్చరర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, హయత్‌నగర్..

**రాయదుర్గం–కోకాపేట నియోపాలిస్ ప్రతిపాదిత స్టేషన్లు..**

బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ, గోల్ఫ్‌కోర్స్, విప్రో సర్కిల్, ఓఆర్ఆర్ జంక్షన్, ఖానాపూర్, కోకాపేట నియోపాలిస్.



## తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారు

### రేవంత్ రెడ్డిపై కవిత ఆగ్రహం

**మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా ఃమార్చారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ దుశ్చర్యతో తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతోందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బతుకమ్మను మాయం చేయడం విడ్డూరమన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం బతుకమ్మను మాయం చేయడం ద్వారా తెలంగాణ ప్రత్యేకత లేకుండా చేశారన్నారు. తెలంగాణ తల్లికి నివాళులర్పించే అర్హత ముఖ్యమంత్రికి లేదన్నారు.

## ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా

# సంజయ్ మల్హోత్రా

## ముగిసిన శక్తికాంత దాస్ పదవీకాలం

ప్రస్తుతం రెవెన్యూ శాఖ కార్యదర్శిగా ఉన్న సంజయ్ మల్హో త్రా

మల్హో త్రా నియామకానికి కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం

ఆర్బీఐ 26వ గవర్నర్ గా మూడేళ్ల పాటు కొనసాగనున్న మల్హో త్రా




**న్యూఢిల్లీ, మహా :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్బీఐ గవర్నర్ గా బాధ్యతలు నిర్వర్తించిన శక్తికాంత దాస్ స్థానాన్ని సంజయ్ మల్హోత్రా భర్తీ చేయనున్నారు. శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్ గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు చేపట్టారు. ఆయన మూడేళ్ల పదవీ కాలం పూర్తయినప్పటికీ, మరికొన్నాళ్ల పాటు పదవీకాలం పొడిగించారు. పొడిగించిన పదవీకాలం డిసెంబరు 10తో ముగియనుంది.

శక్తికాంత దాస్ స్థానంలో ఆర్బీఐ పగ్గాలు అందుకోబోతున్న సంజయ్ మల్హోత్రా పదవీకాలం బుధవారం ప్రారంభం కానుంది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ మేరకు ఆమోద ముద్ర వేసింది. సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంకుకు 26వ గవర్నర్ గా సేవలు అందించనున్నారు. సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఆయన ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్ లో ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రిన్స్ టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీ సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. సివిల్స్ రాసి ఐఏఎస్ అయిన సంజయ్ మల్హోత్రా... తన 33 ఏళ్ల కెరీర్ లో విద్యుత్, ఆర్థిక, పన్నులు, సమాచార సాంకేతికత, గనుల శాఖలో విధులు నిర్వరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల పర్యటన

**హైదరాబాద్, మహా:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల పాటు జైపూర్, ఢిల్లీలో పర్యటించనున్నారు. డిసెంబర్ 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. మొదట వ్యక్తిగత పనుల నిమిత్తం రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్ళనున్నారు. ఆ తర్వాత రెండు రోజులు ఢిల్లీలో పర్యటిస్తారు. ఢిల్లీలో తెలంగాణకు సంబంధించిన అంశాలపై వివిధ శాఖల మంత్రులు, అధికారులతో చర్చిస్తారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతోనూ ఆయన సమావేశమవుతారు. కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై ఢిల్లీ పెద్దలతో చర్చించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీ వరకు వాయిదా పడ్డాయి ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు కూడా ముఖ్యమంత్రితో ఢిల్లీకి వెళ్లే అవకాశముంది.



# విధ్వంసం నుంచి వికాసం దిశగా

## ఖాళీ ఖజానా చేతికి ఇచ్చిన గత ప్రభుత్వం

### భట్టి విక్రమార్క చేతిలో ఖజానా పదిలం

### ఆర్థికశాఖను గాడిలో పెట్టిన భట్టి

### ఆరు హామీల అమలులో భట్టి కీలక పాత్ర

**నీళ్ళు, నిధులు, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ సమాజం కోరి కొట్లాడి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాడు మిగులు బడ్జెట్ ఉండగా, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నీళ్ల, నిధులు, నియామకాల జాడ లేకపోగా 7 లక్షల కోట్ల అప్పు మిగిలింది. గత పాలకుల పదేళ్ల పాలనలో వందేళ్ల ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించారు. ప్రజల డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. జమా లెక్కలు చూపకుండా పాలనకు పాతర వేశారు. రాష్ట్రం అంధకారబంధురమైన సమయంలో డిప్యూటీ సీఎం హోదాలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన భట్టి విక్రమార్క ఏడాది పాలనలో అద్భుత విజయాలు సాధించారు. ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టారు. - మహా, హైదరాబాద్**



### ఉద్యోగ నియామకాలు

కోరి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమే. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 43,880 పోలీసు, విద్య, వైద్య, ఇతర విభాగాల్లో ఉద్యోగ నియామకాల ప్రక్రియను పూర్తిచేసి నిస్సహాయులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారు. మెగా డీఎస్సీ ద్వారా 10,006 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న 563 గ్రూప్1 పోస్టులకు విజయవంతంగా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో 5,378 అదరపు పోస్టులు భర్తీ చేశారు. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం మార్చిలో అసెంబ్లీలో ఆడిట్ రిపోర్టును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. గత పది ఏళ్ల పాలకులు ఈ సంస్కృతిని తుంగలో తొక్కారు. ఆర్థిక క్రమశిక్షణను పాటించకపోవడంతో ఎనిమిది అడిట్ రిపోర్టులు పెండింగ్ లో ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం రాగానే 202021 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగు రిపోర్టులు, 202122 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండు రిపోర్టులు, 202223 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండు అడిట్ రిపోర్టులను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

ఈ రాష్ట్ర సంపద ఏ కొందరికో పరిమితం కాదు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పైసా పేదలకు పంచాలి... సమాజంలో అంతరాలను తగ్గించాలి... అనే సిద్ధాంతాన్ని నమ్మి తూచ తప్పకుండా పాటిస్తూ తన ఏడాది పాలనను పూర్తి చేసుకున్నారు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన, ప్రణాళికా శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క. సంపద సృష్టిస్తాం, సంపద పంచుతాం అంటూ ధైర్యంగా ముందుకు వెళ్తున్నారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన ప్రజాస్వామ్యం, సామ్యవాద భావజాలాన్ని అణువణువునా నింపుకున్న డిప్యూటీ సీఎం ఆచరణలో అక్షరాల పాటిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు వ్యవస్థను క్రమంగా పరుగులు పెట్టిస్తున్నారు. ఓ వైపు గత పాలకులు చేసిన అప్పులకు అసలుతో పాటు వడ్డీలు చెల్లిస్తూనే మరోవైపు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకి లేకుండా ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీల అమల్లో ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషిస్తున్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రం ప్రవేశపెట్టడం ద్వారా ఆడిట్ రిపోర్టులు సభ ముందు ఉంచి ఆర్థిక పాలనలో పారదర్శకతను చాటుతున్నారు. అవినీతి, బంధుప్రీతి, దుబారా వంటి అంశాలకు తావు లేకుండా గత చరిత్రను తిరగరాస్తూ భారత దేశానికి తెలంగాణ ఒక రోల్ మోడల్ గా నిలిపే పనిలో డిప్యూటీ సీఎంగా, ఆర్థిక, ఇంధణ, ప్రణాళిక శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ... రోజుకు 16 గటంల పాటు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ఆశ్రమ ఫలితంగానే ఏడాది కాలంలో తెలంగాణ రాష్ట్రం ఊహకు కూడా అందని ఆర్థిక విజయాలు సాధించింది.

#### ఆర్థిక శ్వేత పత్రం

2023 డిసెంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసనసభలో రాష్ట్రా ఆర్థిక పరిస్థితులపై డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న విక్రమార శ్వేత పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి 10 ఏళ్లలో వందేళ్ల ఆర్థిక విధ్వంసం సృష్టించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. గత ప్రభుత్వం ఆర్థిక శాఖ నిర్వహణలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయలేదు. దీంతో గత ప్రభుత్వం ఆర్థిక పరిపాలనలో చేసిన తీవ్ర తప్పిదాలను, భవిష్యత్ అవసరాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం వంటి వాస్తవ ఆర్థిక పరిస్థితులను ప్రజులు ముందు పెట్టాలన్న ఉద్దేశంతో అసెంబ్లీలో భట్టి ఆర్థిక శ్వేత పత్రం ప్రవేశ పెట్టారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఆర్థిక పరిపాలను పారదర్శకతను తీసుకువచ్చే దిశగా శ్వేతపత్రం తోడ్పడింది.

#### 2024-25 బడ్జెట్ ఆమోదం

పాలన అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర శాసనసభలో మొదటి నాలుగు నెలల తాత్కాలిక బడ్జెట్ ను భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. అనంతరం ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తిస్థాయిలో 202425 సంవత్సరానికి ఆయన బడ్జెట్ సమర్పించి ఆమోదం పొందారు. గత ప్రభుత్వం నిధుల దిర్వినియోగం ప్రణాళికలు సరిగ్గా అమలు చేయడంలో విఫలమవ్వడం వల్ల సమస్యలు తలెత్తాయి, ఈ పరిస్థితులను ప్రస్తుత ప్రభుత్వం సరిచేసే ప్రయత్నాలు చేసింది. ఈ దిశగా ఇచ్చిన హామీలన్నీ నిరవేర్చడంలో ప్రజా ప్రభుత్వం నిబద్ధతని పాటిస్తోంది.

#### సకాలంలో జీతాలు విడుదల

మార్చి 2024 నుంచి ప్రతి నెలా 1వ తేదీన 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు, 2,88,000 మంది పెన్షనర్లకు పెన్షన్లు సకాలంలో చెల్లించడం ప్రారంభమైంది. గతంలో జీతాలు, పెన్షన్లు ఆలస్యంగా చెల్లించబడటం వలన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎదురైన ఇబ్బందులను పరిష్కరించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకుని ఉద్యోగులపట్ల తమకున్న చిత్తశుద్ధిని ప్రజా ప్రభుత్వం ప్రదర్శించింది ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రతి నెలా మొదటి తేదీన ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో నమోదు చేస్తూ ఆర్థిక మంత్రి ఆర్థిక సవాళ్లతో చేస్తున్నారు.

#### 16వ ఆర్థిక సంఘం పర్యటన

2024 సెప్టెంబర్లో 16వ ఆర్థికసంఘం తెలంగాణ రాష్ట్రాన్ని సందర్శించింది. ఆర్థిక సంఘం సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆదాయం, వ్యయం, ప్రజా సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు వాటిని పూర్తి చేయడానికి రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద ఉన్న ప్రణాళికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖా మంత్రి భట్టి విక్రమార్క ముల్లు వివరించిన తీరును ఆర్థిక సంఘం ప్రశంసించింది. గత ప్రభుత్వాలు సరైన ఆర్థిక ప్రణాళికలు తయారు చేయడంలో విఫలమవ్వడం వల్ల రాష్ట్రానికి గణనీయమైన నష్టం జరిగిందని ఈ ప్రదర్శనలో వారు ఇరువురు పునరుద్ఘాటించారు.

#### రుణాల పొదువు, తిరిగి చెల్లింపు

2023 డిసెంబర్ నుంచి 2024 అక్టోబర్ వరకు ప్రభుత్వం రూ.51,118 కోట్లు రుణాలు తీసుకోగా గత ప్రభుత్వ రుణాలపై వడ్డీతో పాటు రూ.59,509 కోట్లు తిరిగి చెల్లించింది. గత ప్రభుత్వాల అవసరం లేని రుణాల కారణంగా నేడు ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆ రుణాలను తీర్చడానికి నిధులు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రజా ప్రభుత్వం చేసిన అప్పు కన్నా అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అయినా ఏమాత్రం తొట్రుపాటుకు గురికాకుండా భట్టి విక్రమార్క ముందుకు తీసుకువెళుతున్నారు.

#### ఫ్లాగ్ షిప్ స్కీములకు నిధుల కేటాయింపు

ప్రజా ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ప్రధాన సంక్షేమ పథకాలకు రూ.56,486 కోట్లను కేటాయించి ప్రాజెక్టులను ముందుకు నడిపించింది. ఇందులో రైతు భరోసా, రైతు రుణమాఫీ, చేయూత, ఆరోగ్య శ్రీ, విద్యార్థులకు సంబంధించిన ఇతర ముఖ్య పథకాలు ఉన్నాయి. గత ప్రభుత్వం హేతుబద్ధమైన విశ్లేషణ లేకుండా అనేక పథకాలను ప్రతిపాదించి వాటిని సరిగా అమలు చేయకపోవడం వలన ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు ప్రస్తుత ప్రభుత్వం ఈ కేటాయింపుల ద్వారా సరి చేయడానికి ప్రయత్నిస్తోంది.

#### హేతుబద్ధంగా వనరుల వినియోగం

గత ప్రభుత్వం రైతులకు, మహిళలకు, విద్యార్థులకు ప్రకటించిన పథకాలు అనేక దఫాలలో అమలులో లోపాలను ఎదుర్కొన్నాయి. ప్రజా ప్రభుత్వం 2023 24లో రూ.9,240 కోట్లను వివిధ సంక్షేమ పథకాలకు కేటాయించి, వాటి పటిష్ట అమలుకి చర్యలు చేపట్టింది.

#### రైతులకు రుణమాఫీ పథకం

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో 22.47 లక్షల మంది రైతులకు రూ.17,896 కోట్ల రుణమాఫీని ఒకేసారి అమలు చేసి రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలని సరి చేసి రైతాంగానికి మేలు చేకూర్చింది.

#### నష్ట పరిహార చెల్లింపులు

రాష్ట్రంలో వర్షాల కారణంగా పంటలకు, ఇళ్లకు జరిగిన నష్టానికి, ఇతర నష్టాలకు తక్షణ పరిహారంగా రూ.250 కోట్లు విడుదల చేశారు. తద్వారా వంట నష్టం పరిహారపు చెల్లింపులో గత ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్య విధానాలకు ప్రజా ప్రభుత్వం స్వస్తి పలికింది.

# లేచింది మహిళా లోకం

## జాతీయ అవార్డులకు ఎంపికైన 42 గ్రామ పంచాయతీలు

### ఇందులో 42 శాతం మహిళా ప్రజా ప్రతినిధులే

డిసెంబర్ 11న జాతీయ పంచాయతీ పురస్కార విజేతలకు రాష్ట్రపతి ముర్ము సత్కారం

ప్రకటించిన జాతీయ పంచాయత్ రాజ్ మంత్రిత్వ శాఖ




**న్యూఢిల్లీ, మహా :** ప్రతిష్టాత్మక జాతీయ పంచాయతీ అవార్డులను 20222023 సంవత్సరానికి అందుకోబోయేవారి వివరాలను పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అట్టడుగుస్థాయిలో అన్ని వర్గాలవారికీ అందే, దీర్ఘకాలం పాటు నిలిచి ఉండే అభివృద్ధి ప్రక్రియకు ఊతాన్నిచ్చే దిశలో దేశంలోని పంచాయతీ రాజ్ సంస్థలు చేస్తున్న మార్గదర్శక కృషిని, ప్రావీణ్యాన్ని గుర్తించేందుకు ఈ పురస్కారాలు తోడ్పడుతాయి. ఈ నెల 11న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే జాతీయ పంచాయతీ పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొని అవార్డు విజేతలకు, స్వీకర్తలకు పురస్కారాలను అందజేయనున్నారు.

అట్టడుగు స్థాయిలో పాలన, సమాజ అభివృద్ధి రంగాల్లో విస్తృత శ్రేణిలో విజయాలను సాధించిన వారిని వివిధ కేటగిరీల్లో మొత్తం 45 మందిని ఈ సంవత్సరం పురస్కార విజేతలుగా ఎంపిక చేశారు. ఈ కేటగిరీల్లో దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం, గ్రామ్ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ పురస్కారం, కర్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయత్ పురస్కారంలతోపాటు పంచాయత్ క్షమతా నిర్మాణ్ సర్వోత్తమ్ సంస్థాన్ పురస్కార్‌లు ఉన్నాయి. ఈ పురస్కారాలు పేదరికాన్ని తగ్గించడం, ఆరోగ్య సంరక్షణ, బాలల సంక్షేమం, నీరు తగినంత స్థాయిలో లభ్యమయ్యేటట్టు జాగ్రత్త చర్యలు తీసుకోవడం, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక న్యాయం, మహిళలకు సాధికారిత కల్పన, వాతావరణ స్థిరత్వాన్ని పరిరక్షించడం వంటి కీలక రంగాలలో సాధించిన విజయాలను గుర్తిస్తాయి.

ఈ సంవత్సరం పోటీలో 1.94 లక్షల గ్రామ పంచాయతీలు పాల్గొనగా, 42 అవార్డులను గెలుచుకున్నాయి. ఇందులో 42 శాతం పంచాయతీలకు మహిళలే నాయకత్వం వహిస్తుండటం విశేషం. ఎంపికకు సునిశిత ప్రక్రియను అనుసరించారు. బ్లాకు స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఏర్పాటు చేసిన 5 వివిధ కమిటీలు కొన్ని ప్రధాన రంగాలలో లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎల్ఎస్‌డీజీ)కి అనుగుణంగా పంచాయతీలు కనబరచిన పని తీరును క్షుణ్ణంగా మదింపు చేశారు. పంచాయతీ రాజ్ సంస్థలలో (పీఆర్ఐస్), గ్రామీణ స్థానిక సంస్థలలో (ఆర్ఎల్‌బీ) పోటీ తత్వాన్ని ప్రోత్సహించడంతోపాటు పారదర్శకత్వాన్ని పెంచడానికి పంచాయతీ రాజ్ శాఖ కనబరుస్తున్న అచంచల నిబద్ధతను ఈ ప్రక్రియ ప్రముఖంగా చాటిచెబుతోంది. అవార్డుల ప్రకటన ఘట్టం పూర్తి కావడంతో, పంచాయతీ రాజ్ సంస్థల అభినందనీయ విజయాలను ఒక ఉత్సవంగా నిర్వహించడానికి రంగాన్ని సిద్ధం చేశారు. గ్రామీణ సమాజాలు చైతన్యంతో పాటు ఎలాంటి ప్రతికూల పరిస్థితులకైనా ఎదురొడ్డి నిలవగలిగేటట్లుగా వాటిని తీర్చిదిద్దడంలో పంచాయతీలు పోషించవలసిన పరివర్తనాత్మక పాత్రను ఈ పురస్కారాల ప్రకటన బలపరుస్తున్నది. ఈ పురస్కారాలను ఆయా సంస్థలు అమలు చేసిన అసాధారణ కార్యనిర్వహణకు ఒక గుర్తింపుగా ప్రదానం చేయడంతో పాటు, ఈ అత్యుత్తమ పద్ధతులను అనుసరించేటట్లుగా ఇతర పంచాయతీలకు ప్రేరణను అందించాలనే ఉద్దేశంతో కూడా ఇస్తున్నారు.



# కొడంగల్ వాసికి 2 కోట్ల వార్షిక వేతనం

## అమెజాన్‌లో ఆఫర్


**వికారాబాద్, మహా :** కొడంగల్ నియోజకవర్గం బొంరస్ పేట్ మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన సయ్యద్ యాసిన్ ఖురేషి (జైంట్ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ తెలంగాణ) కుమారుడు సయ్యద్ అర్బాజ్ ఖురేషి (26) కి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీ అమెజాన్ లో రూ. 2 కోట్ల రూపాయల వార్షిక వేతనంతో అమెరికాలో అప్లైడ్ సెంటిస్ట్ గా ఉద్యోగావకాశం వచ్చింది. సోమవారం అతను ఈ ఉద్యోగంలో చేరాడు. 2019 లో ఐఐటి పాట్నా నుండి కంప్యూటర్ సైన్సులో తన బీటెక్ పూర్తి చేసిన యువకుడు 198090 ల్లో నియోజకవర్గంలో ఆర్ఎంపీ డాక్టర్ గా సేవలందించిన గాంధేయవాది, మానవతావాది, అప్పటి కాంగ్రెస్ నాయకులు దివంగత డాక్టర్ జలాలుద్దీన్ ఖురేషి మనవడు. బీటెక్ మూడవ సంవత్సరంలో ఫ్రాన్స్ కు చెందిన ప్రముఖ మెషీన్ లెర్నింగ్ కోవిదుడు గెయిల్ డియాస్ వద్ద మూడు నెలల ఇంటర్న్ షిప్ చేశాడు. తరువాత బెంగళూర్ లోని మైక్రోసాఫ్ట్ రీసర్చ్ లో రెండు సంవత్సరాలు పనిచేసి, అమెరికాలోని (యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ (యూఎంఎఎస్ఎస్) నుండి 2023 లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్,మెషీన్ లెర్నింగ్ లో ఎంఎస్ పట్టా పొందాడు. ఎంఎస్ లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రముఖ ఐటీ సంస్థ అయిన గూగుల్ లో ఇంటర్న్షిప్ చేసే అవకాశం దక్కింది. స్థానిక మూలాలు కలిగిన ఈ యువకుడి విజయం వెనకబడ్డ కొడంగల్ ప్రాంత యువతకు స్ఫూర్తి నివ్వాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# చెన్నమనేని జర్మనీ పౌరుడే..

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రమేశ్‌పై హైకోర్టు ఆగ్రహం

- కోర్టును తప్పుదోవ పట్టించారంటూ ఫైన్
- రూ.30లక్షల జరిమానా విధింపు
- నెల రోజుల్లో చెల్లించాలంటూ ఆదేశాలు






**హైదరాబాద్, మహా :** పౌరసత్వంపై బీఆర్ఎస్ నేత, వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టును తప్పుదోవ పట్టించినందుకు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టుకు ఫేక్ డాక్యుమెంట్స్ సమర్పించారని మండిపడింది. చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చి చెప్పింది. అంతేకాదు రమేశ్‌కు రూ. 30 లక్షల జరిమానా విధించింది హైకోర్టు. పిటిషనర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు రూ.25 లక్షలు చెల్లించాలని, మిగిలిన రూ.5లక్షలు లీగల్ సర్వీ సెస్ అథారిటీకి చెల్లించాలని, ఈ చెల్లింపులు నెల రోజుల్లో చేయాలని కోర్టు ఆదేశించింది.

#### రమేశ్ పిటిషన్ డిస్మిస్

వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కేసు తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సోమవారం తీర్పు నేపథ్యంలో మరికొన్ని అంశాలను న్యాయమూర్తి. ప్రస్తావించారు. ఇన్ని రోజులు చెన్నమనేని రమేశ్ ఏ పాస్ పోర్ట్ మీద ట్రావెల్ చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. జర్మనీ పాస్ పోర్ట్ మీద ట్రావెల్ చేశారని చెన్నమనేని తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కోర్టును తప్పుదోవ పట్టించినందుకు హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని రమేశ్ పిటిషన్ డిస్మిస్ చేసింది.

#### సుదీర్ఘ విచారణ

పదిన్నర ఏళ్లపాటు హైకోర్టులో చెన్నమనేని రమేష్ కేసు సుదీర్ఘ విచారణ జరిగింది. విచారణ సమయంలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించారని కోర్టు మండి పడింది. చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టు రూ. 30 లక్షల జరిమానా విధించింది. ఆది శ్రీనివాస్‌కు రూ. 25 లక్షలు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరో రూ.5 లక్షలు హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది. నెల రోజుల్లో చెల్లింపులు పూర్తి చేయాలని చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టు ఆదేశించింది. నెలరోజుల పాటు ఆర్డర్‌ను సస్పెన్షన్‌లో ఉంచాలని చెన్నమనేని రమేశ్ న్యాయవాది కోరారు.

#### 2009లో రాజకీయాల్లోకి

రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయాల్లో చెన్నమనేని కుటుంబాలు లేకుండా చూడలేం. వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం నాగారం నుంచి మొదలైన చెన్నమనేనిల రాజకీయ ప్రస్థానం ఎంతో ప్రతిష్టాత్మకంగా సాగింది. రాజేశ్వర్‌రావు వారసుడిగా 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన చెన్నమేని రమేశ్‌బాబు వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వచ్చారు. బీఆర్ఎస్ పార్టీలోనూ చురుకుగా ఉన్నారు. 2009లో సార్వత్రిక ఎన్నికల్లో వేములవాడ నుంచి బీజేపీ అభ్యర్థిగా రమేశ్‌బాబు పోటీ చేయగా ప్రత్యర్థిగా అది శ్రీనివాస్ నిలిచారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూసిన శ్రీనివాస్.. రమేశ్‌బాబు ఎన్నిక చెల్లదని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పౌరసత్వం పొందారని హైకోర్టును ఆశ్రయించారు.

#### జరిగింది ఇదీ

2010 జూన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా రమేష్‌బాబు పోటీ చేసిన సందర్భంలోనూ అది శ్రీనివాస్ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. అప్పుడు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను నిలిపి వేసింది. హైకోర్టును బీఆర్ఎస్ పార్టీ ఆశ్రయించగా అరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ఎన్నికలు జరపాలని చెప్పింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉప ఎన్నికల్లో హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి రమేశ్‌బాబు పౌరసత్వంపై అది శ్రీనివాస్ పోరాటం చేస్తూనే వచ్చారు. 2013లో రమేశ్‌బాబు పౌరసత్వాన్ని శాసనసభ సభ్యత్వాన్ని హైకోర్టు రద్దు చేసింది. రమేశ్‌బాబు సుప్రీం కోర్టును అశ్రయించి స్టే పొందారు. 2014 ఎన్నికల్లో మరోసారి రమేశ్‌బాబు గెలుపొందారు. కేంద్ర హోంశాఖ సుప్రీం కోర్టు ఆదేశాలతో 2017లో రమేశ్‌బాబు పౌరసత్వాన్ని రద్దు చేసింది. హోంశాఖ హైకోర్టును సంప్రదించవచ్చని పేర్కొనడంతో మళ్లీ హైకోర్టుకు చేరుకుంది.

# 2027లో ఒకే దేశం ఒకే ఎన్నికలు


## పార్లమెంటు ముందుకు జమిలి ఎన్నికల బిల్లు

**హైదరాబాద్, మహా:** 2027లో దేశంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వేగంగా పావులు కదుపుతోంది. జమిలి ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే బిల్లు రూపొందినట్లు బీజేపీ వర్గాల నుంచి తెలుస్తోంది. 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వచ్చే పార్లమెంట్ సెషన్‌లో బిల్లును కచ్చితంగా ఉభయసభల ముందుకు తీసుకురావాలని భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికలతోపాటే వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఒకే దఫా ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఈ బిల్లుకు సంబంధించి పలు సిఫారసులు చేసింది. అనంతరం బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇక బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడమే తరువాయిగా ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర పడితే వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంట్లో ప్రవేశపెట్టడానికి ముందు బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పంపాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. జేపీసీ అన్ని పార్టీల ప్రతినిధులతో ఈ బిల్లుపై చర్చించి అందరి అంగీకారాన్ని తీసుకోనుంది. అంతేగాక అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్‌ల నుంచి ప్రభుత్వం ఈ బిల్లుపై అభిప్రాయాలు కోరింది. మేధావులు, నిపుణులు, పౌర సమాజ సభ్యులు తదితరులను కూడా ఈ బిల్లుపై చర్చలో భాగస్వాములను చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఆ తర్వాత సాధారణ ప్రజానీకం నుంచి కూడా ఈ బిల్లుపై అభిప్రాయాలను కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

EDITORIAL ఎడిటోరియల్

# సిరియాలో శాంతిస్థాపన

పశ్చిమాసియాలో ఎప్పటి నుంచో సంక్షుభిత పరిస్థితులు ఉన్న దేశాల్లో సిరియా ఒకటి. సుదీర్ఘకాలంగా ఇక్కడ అంతర్యుద్ధం నడుస్తోంది. తిరుగుబాటుదారులకు భయపడి దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి రష్యాకు పారిపోవడం సిరియాలో నెలకొన్న సంక్షోభానికి పరాకాష్ఠ. అంతర్జాతీయ సమాజం సిరియా పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. పశ్చిమాసియా దేశం సిరియా అంతర్యుద్ధంలో తిరుగుబాటుదారులు ఎట్టకేలకు పైచేయి సాధించారు. ఐదు దశాబ్దాల పాటు అప్రతిహతంగా సాగిన అసద్ కుటుంబ పాలన ముగిసిపోయింది. 2001లో 13 ఏళ్ల కిందట ఓ టీనేజర్ నాటిన తిరుగుబాటు విత్తనం.. ఇంతింతై వటుడింతై అన్నట్టు అంతర్యుద్ధానికి దారితీసింది. చివరకు అసద్ నియంతృత్వ సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకలించింది. నాటి 'అరబ్ స్ప్రింగ్' ఉద్యమ తీవ్రతను గుర్తించని బషర్ .. ఇప్పుడు భారీ మూల్యం చెల్లించుకున్నారు. దశాబ్దం తర్వాత ప్రాణాలు అరచేత పెట్టుకొని దేశం వదిలి పారిపోవాల్సి దుస్థితి వచ్చింది. దక్షిణ సిరియాలోని ట్యునీషియాలో మహమ్మద్ బువాజీజీ అనే చిరు వ్యాపారితో ఓ పోలీస్ అధికారి దురుసుగా ప్రవర్తించాడు. ఆ అవమానాన్ని తట్టుకోలేక వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికి.. వీధుల్లోకి వచ్చి చేపట్టిన ఆందోళనలు అధ్యక్షుడ్ని గద్దె దించేవరకు సాగాయి. క్రమంగా ఈజిప్ట్, యెమెన్, లిబియాలకు ఈ ఆందోళనలు విస్తరించి అక్కడి పాలకులను వణికించాయి. ఇక, సున్నీల జనాభా అధికంగా ఉన్న సిరియా.. అలావైట్ల అయిన అసద్ కుటుంబ పాలనలో చిక్కుకుంది. బషర్ అల్ అసద్ తండ్రి హఫీజ్ అల్‌అసద్... 1970లో నాటి ప్రభుత్వంపై తిరుగుబాటుతో అధికారం దక్కించుకున్నారు. తొలుత ప్రధాన మంత్రి, తర్వాత అధ్యక్షుడైన



ఆయన 2000లో మరణించే వరకూ పదవిలో కొనసాగారు. హఫీజ్ మరణంతో లండన్ నుంచి తిరిగొచ్చిన బషర్ పాలనా పగ్గాలు చేపట్టారు. ఇలా పదేళ్లు గడిచిపోగా.. కరువు నెలకొనడంతో 2011 నాటికి బషర్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత గూడుకట్టుకుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా బషర్ తన సైన్యం, పోలీసులను అప్రమత్తం చేసి అణచివేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో దారా నగరంలో 2011 ఫిబ్రవరి 14న మౌవియా సియాస్నే అనే పద్నాలుగేళ్ల బాలుడు ఓ రోజు పాఠశాల గోడపై 'ఎజాక్ ఎల్ దూర్ య డాక్టర్' (ఇప్పుడు నీ వంతు వచ్చింది డాక్టర్) అని పెద్ద అక్షరాలతో రాశాడు. ఈ రాతలే దేశగతిని మార్చేస్తాయని అప్పుడు ఆ టీనేజర్ కలలో కూడా అనుకోలేదు. కంటి డాక్టరైన బషర్‌ను సిరియాలో 'డాక్టర్' అని సంబోధించేవారు. సాయంత్రం ఇంటికొచ్చిన మౌవియా సియాస్నే.. స్కూల్‌లో తాను రాసిన స్లోగన్ గురించి తన తండ్రికి కూడా చెప్పాడు. దీంతో ఆ కుటుంబం భయపడిపోయింది. వారి భయం నిజమైన ఆ విషయం స్థానిక పోలీస్ అధికారికి తెలిసింది. అసద్‌కు సన్నిహితుడైన వ్యక్తి. ఆదేశాలతో దారాలోని దాదాపు 20 మంది పిల్లలను సైనికులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. వారి కుటుంబాలు కాళ్లావేళ్లాపడి ప్రాధేయపడినా జాలిచూపలేదు. దీనిపై ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టగా.. దేశం మొత్తం వ్యాపించాయి. పరిస్థితి తీవ్రంగా మారుతుండటంతో అసద్ తరఫున కొందరు వచ్చి దారాలోని పెద్దలను కలిసి.. దాదాపు 26 రోజుల నిర్బంధం తర్వాత పిల్లలను విడిచిపెట్టారు. ఈసందర్భంగా పాలకులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయమని వారితో సంతకాలు చేయించుకున్నారు. ఈ ఘటన తర్వాత ఆ పిల్లల పరిస్థితి మరింత దిగజారింది. దీంతో 2011 మార్చి 15న తొలిసారి దేశవ్యాప్తంగా 'డే ఆఫ్ రేజ్' పాటించారు. ఈ ఉద్యమాన్ని అదుపు చేయడానికి అసద్ మళ్లీ హింసనే ఎంచుకొన్నారు. దీంతో ఈ ఆందోళనలు మరింత హింసాత్మకంగా మారాయి. ఈ క్రమంలో సిరియా సైన్యం రెండుగా చీలిపోయింది. జులైన 2011న ఫ్రీ సిరియా ఆర్మీగా ఏర్పడి అసద్ కుటుంబంపై పోరాటానికి ప్రారంభించాయి. అయితే, ఈ ఉద్యమంలోకి ఐసిస్, జబాత్ అల్ నుస్రా, అల్ ఖైదా, ఖుర్దు వంటి ఉగ్రవాదు సమూహాలు చొరబడ్డాయి. అటు, అమెరికా, రష్యా, ఇరాన్, తుర్కియే, ఇజ్రాయేల్ వంటి దేశాలు ఈ అంతర్యుద్ధంలో చేరాయి.

కానీ రష్యా, ఇరాన్‌ల సహకారంతో తిరుగుబాట్లను అసద్ అణచివేయడంతో కొన్నాళ్లు ఇడ్లిబ్ ప్రాంతానికే రెబల్స్ పరిమితం అయ్యారు. కానీ, ఇటీవల పరిణామాలతో ఇరాన్, రష్యా బలహీనపడినట్లు అంచనాలకు రావడంతో హయాత్ తహరీర్ అల్ షామ్ నేతృత్వంలోని తిరుగుబాటుదళాలు మెరుపు దాడులు చేసి అసద్‌ను దేశం నుంచి వెళ్లగొట్టాయి. దాదాపు 13 ఏళ్లపాటు సాగిన సిరియా అంతర్యుద్ధంలో దాదాపు 6 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోగా.. 13 మిలియన్ల మంది నిరాశ్రయులైనట్టు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది.

ఇపుడు సిరియా అంశంపై భారత కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించింది. సిరియాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. సిరియాలో మళ్లీ స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నామని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. సిరియా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, ఐక్యతను పరిరక్షించుకునేందుకు అక్కడి అన్ని పార్టీలు కలసికట్టుగా పనిచేయాలని సూచించింది. అంతిమంగా సిరియా ప్రజల మనోభావాలకు అనుగుణంగా శాంతిస్థాపన జరగాలని, ఆ మేరకు రాజకీయ ప్రక్రియ ఉండాలని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇక సిరియాలో ఉన్న భారత పౌరుల భద్రత కోసం, రాజధాని డమాస్కస్ నగరంలోని భారత దౌత్య కార్యాలయాన్ని అన్ని వేళలా తెరిచి ఉంచుతున్నట్టు భారత్ ప్రకటించింది.

# మెగా బ్రదర్స్

## ఇక మినిస్టర్ బ్రదర్స్


### తెలుగునాట మరో పవర్ ఫుల్ పొలిటికల్ ఫ్యామిలీ



తెలుగునాట మరో పవర్ ఫుల్ పొలిటికల్ ఫ్యామిలీగా కొణిదెల కుటుంబం రూపాంతరం చెందింది. గతంలో మెగాస్టార్ చిరంజీవి కేంద్రమంత్రిగా పనిచేయగా, ఇపుడు పవన్ కల్యాణ్ ఏకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. అదే క్యాబినెట్ లో మరో మెగా బ్రదర్ నాగబాబు మంత్రి పదవి చేపట్టడం ఖాయమైంది. నాగబాబుకు రాజ్యసభ చాన్స్ ఇస్తారంటూ జరిగిన ప్రచారానికి తెరపడింది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సీఎం చంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పాతికమంది మంత్రులకు అవకాశం ఉంది. ప్రస్తుతం చంద్రబాబు క్యాబినెట్ లో 24 మంది మంత్రులు ఉన్నారు. జనసేన పార్టీకి 4 మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా ఉన్నారు. ఇప్పుడు జనసేన నుంచి నాలుగో మంత్రిగా నాగబాబు క్యాబినెట్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. నాగబాబు జనసేన క్యాడర్ కు అత్యంత దగ్గరుండే వ్యక్తి మాత్రమే కాకుండా, పవన్ కల్యాణ్ కు అన్నివిధాలుగా అండగా నిలబడిన రియల్ బ్రదర్. నాగబాబుకు రాజ్యసభ ఇవ్వాల్సిందేనంటూ పట్టుబట్టిన పవన్ కల్యాణ్ తన సోదరుడికి మంత్రి పదవిని సాధించారు. కూటమి ఐక్యత కోసం ఆదినుండీ నిలబడ్డ పవన్ కోరికను తాజా మంత్రిపదవి కేటాయించడం ద్వారా చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఇపుడు మెగా బ్రదర్స్ మెగా మినిస్టర్స్ అవుతున్నారు. ఒకే కేబినెట్ లో అన్నాదమ్ములు ఇద్దరూ మంత్రులుగా ఉండడం ఓ సంచలనం. చిరంజీవితో కలుపుకుంటే మెగా బ్రదర్స్ అంతా మినిస్టర్ హోదా పొందినవారే అవుతారు.

## హరిక్రిష్ణ.. హరీష్.. ఇపుడు నాగబాబు

**నాడు చంద్రబాబు కేబినెట్ లో హరిక్రిష్ణ ఎమ్మెల్యే కాకుండానే మంత్రి పదవి పొందగా, తర్వాత వైఎస్ ఆర్ కేబినెట్ లో హరీష్ రావు ఇదే విధంగా పదవి దక్కించుకున్నారు. ఆ తర్వాత ఇపుడు నాగబాబు ఆ నేతల సరసన చేరారు. నందమూరి, కల్వకుంట్ల కుటుంబాల తర్వాత ఆ ఘనత కొణిదెల కుటుంబానికే దక్కబోతోంది.**



## కొణిదల నాగేంద్రబాబు

### జననం- 1961 అక్టోబర్ 29

**తెలుగు చిత్ర పరిశ్రమ నటుడు, నిర్మాత. చాలా సినిమాల్లో సహాయ నటుడిగానూ, కొన్ని సినిమాల్లో హీరోగాను నటించారు. అంతే కాకుండా అంజనా ప్రొడక్షన్స్ అనే చిత్ర పరిశ్రమ సంస్థకు అధినేత. జనసేన పార్టీ ప్రధానకార్యదర్శి**

**కుటుంబం**

అక్టోబర్ 29, 1961న పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో కొణిదెల వెంకట్రావు, అంజనాదేవి దంపతులకు ద్వితీయ సంతానంగా నాగేంద్రబాబు జన్మించాడు. నాగేంద్రబాబు సోదరులు చిరంజీవి (సినిమా నటుడు, కేంద్ర మాజీమంత్రి), పవన్ కళ్యాణ్ (ఏపి ఉపముఖ్య మంత్రి, సినిమా నటుడు). నాగేంద్రబాబుకు భార్య పద్మజ, కుమారుడు వరుణ్ తేజ్, కుమార్తె నీహారిక ఉన్నారు.

**రాజకీయ జీవితం**

నాగేంద్రబాబు తమ్ముడు పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో చేరి 2019 సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం నుంచి లోక్ సభ సభ్యుడిగా పోటీచేశాడు. ఎన్నికల ఫలితాలలో వై. ఎస్. ఆర్. సి. పి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణ రాజు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వి. వి. శివరామరాజు తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. నాగబాబుకు 21.31% ఓట్లు లభించాయి. ఆ తర్వాత ఐదేళ్లు పవన్ కల్యాణ్ తో కలిసి జనసేన పార్టీ పటిష్టానికి పనిచేసిన నాగబాబు అనకాపల్లి నుండి లోక్ సభకు పోటీచేయాలని భావించారు. అయితే అనూహ్యంగా ఆ సీటును బిజెపి కోరడంతో రాజ్యసభపై అపుడు హామీ లభించింది. ఇపుడు రాజ్యసభకు బదులు మంత్రి పదవిపై హామీ లభించింది. సీఎం స్పష్టమైన ప్రకటన చేయడంతో ఇక ప్రమాణస్వీకారమే మిగిలింది.

## నందమూరి, కల్వకుంట్ల ఫ్యామిలీ తర్వాత

### కొణిదెల ఫ్యామిలీనే.. ఇదీ పవన్ పవర్

కొణిదెల ఫ్యామిలీ మరో రికార్డు క్రియేట్ చేసింది. 21స్థానాల్లో పోటీచేసి 21స్థానాలూ గెలిచి దేశంలోనే ఆల్ టైం రికార్డును జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇపుడు తన సోదరుడికి పదవి సాధించడం ద్వారా మరో చరిత్రకు నాంది పలికారు. నాడు చంద్రబాబు కేబినెట్ లో హరిక్రిష్ణ ఎమ్మెల్యే కాకుండానే మంత్రి పదవి పొందగా, తర్వాత వైఎస్ ఆర్ కేబినెట్ లో హరీష్ రావు ఎమ్మెల్యే కాకుండానే మంత్రి గా ప్రమాణస్వీకారం చేశారు. అలా వారు రాజకీయాలపై పెను ప్రభావం చూపారు. ముఖ్యమంత్రుల కుటుంబాలకు మాత్రమే సాధ్యమైన ఫీట్ ను కొణిదెల కుటుంబం ఇపుడు సాధించింది. ఇపుడు నాగబాబు కూడా అదే కోవలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేచబోతున్నారు. నందమూరి, కల్వకుంట్ల కుటుంబాల తర్వాత ఆ ఘనత కొణిదెల కుటుంబానికే దక్కబోతోంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999





# చరిత్రలో నిలిచేలా..

(మొదటిపేజీ తరువాయి)

గుండు పూసలు, ముక్కు పుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సారలమ్మ పోరాట స్ఫూర్తి, హుందాతో కనిపించేలా విగ్రహాన్ని రూపొందించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు లక్ష మంది మహిళలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ, అలాగే తెలంగాణ తల్లి విగ్రహం రూపకర్త గంగాధర్‌ను, శిల్పి రమణారెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు. అంతకుముందు విగ్రహ ఏర్పాటు, రూపురేఖలపై ఉదయం అసెంబ్లీలో సీఎం కీలక ప్రకటన చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన గురించి అసెంబ్లీలో వివరించారు. సంప్రదాయం, సంస్కృతులు పరిగణలోకి తీసుకొని తెలంగాణ తల్లి రూపకల్పన చేసినట్లు సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర అస్తిత్వాన్ని తెలిపేలా చేతిలో తెలంగాణ పంటలతో కనిపిస్తుందన్నారు. తెలంగాణ తల్లి నిల్చున్న పీఠం చరిత్రకు దర్పణంగా నిలుస్తుందని తెలిపారు.

## చరిత్రలో నిలిచిపోయే రోజు


తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజు చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భూమి ఎక్కడైనా మన అస్తిత్వానికి ప్రతీక తల్లి అని చెప్పారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎన్నో ఏళ్లు అవహేళనకు గురైందన్న ఆయన ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరం టీజీ అని రాసుకున్నామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాత్రం టీజీ అక్షరాలు కాదని టీఎస్ అని పెట్టిందని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టీఎస్‌ను టీజీగా మార్చినట్లు వివరించారు. ఉద్యమం రోజుల్లో ఎక్కడ విన్నా జయ జయహే తెలంగాణ వినిపించేదన్న ఆయన రాష్ట్రం ఏర్పడిన తర్వాత జయ జయహే తెలంగాణ పాటకు గౌరవం దక్కలేదని, అందుకే వారు జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించారని పేర్కొన్నారు. పదేళ్లపాటు తెలంగాణ తల్లి నిరాదరణకు గురైందని అన్నారు. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారు. తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించారు. అమరవీరుల స్థూపం రూపశిల్పి ఎక్కా యాదగిరిని సన్మానిస్తున్నాం. ఎక్కా యాదగిరికి 300 గజాల స్థలం, రూ.కోటి నగదు ఇస్తాం. ఒక వ్యక్తి కోసమో, ఒక కుటుంబం కోసమో తెలంగాణ తెచ్చుకోలేదు. 4 కోట్ల ప్రజల కోసం తెలంగాణ సాధించుకున్నాం అని సిఎం అన్నారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, పొన్నం, సీతక్క, కొండా సురేఖ, దామోదర, జూపల్లితో పాటు సభాపతి ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు, వేలాదిగా మహిళలు, అధికారులు హాజరయ్యారు. అనంతరం తమన్ సంగీతవిభావరి ఆహుతులను అలరించింది.













# మోహన్ బాబు ఫ్యామిలీలో.. ఆస్తి పంచాయతీ



**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ యాక్టర్ మంచు మోహన్ బాబు ఫ్యామిలీలో హైడ్రామా కొనసాగుతోంది. ఇప్పటికే మోహన్‌బాబు, కుమారుడు మంచు మనోజ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. మంచు మనోజ్ కాళ్లకు గాయాలవడంతో బంజారాహిల్స్‌లోని టీఎక్స్ ఆస్పత్రిలో చేరాడు. తాజాగా ఈ వ్యవహారంలో మంచు మనోజ్‌పై మోహన్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మనోజ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలియజేస్తూ రాచకొండ సీపీకి మోహన్ బాబు లేఖ రాశారు. తనకు రక్షణ కల్పించాలని రాచకొండ సీపీని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మంచు మనోజ్ పహాడి షరీఫ్‌లో తనపై 10 మంది వ్యక్తులు దాడి చేశారని, విజయ్, కిరణ్ సీసీటీవీ పుటేజ్ తీసుకెళ్లారని.. తనకు ప్రాణహాని ఉన్న నేపథ్యంలో రక్షణ కల్పించాలని మనోజ్ పోలీసులను కోరాడు. ఈ వ్యవహారంలో ఇప్పటికే మంచు విష్ణు, మంచు లక్ష్మి కూడా ఎంట్రీ ఇవ్వగా.. మరి ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది తెలియాల్సి ఉంది.

## మోహన్ బాబు లేఖలో సంచలన విషయాలు

తన చిన్న కుమారుడు మంచు మనోజ్, అతని భార్య మౌనికల నుంచి తనకు ప్రాణహాని ఉందని ప్రముఖ సినీనటుడు మోహన్ బాబు రాచకొండ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తనకు, తన ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా జల్పల్లిలోని మంచు టౌన్ లో గత 10 ఏళ్లుగా నివాసం ఉంటున్నానని, ఇప్పుడు ఆ ఇంటిని మనోజ్, మౌనికలు ఆక్రమించుకొని ప్రైవేటు వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మోహన్ బాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు నెలల కిందటే మనోజ్ ఇంటిని విడిచిపెట్టి వెళ్లిపోయాడని, ఇప్పుడు కొందరు సంఘ వ్యతిరేకులతో కలిసి తన ఇంటి వద్ద కలవరం సృష్టిస్తున్నాడని వాపోయిన మోహన్ బాబు.... తన భద్రత, విలువైన వస్తువులు, ఆస్తుల విషయంలో భయంగా ఉందన్నారు. అలాగే మాదాపూర్‌లోని తన కార్యాలయంలోకి 40 మంది ప్రైవేటు వ్యక్తులు చొరబడి సిబ్బందిని బెదిరించినట్లు రాచకొండ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మోహన్ బాబు రాసుకొచ్చారు. చట్టవిరుద్ధంగా తన ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు మనోజ్, మౌనికలు ప్లాన్ చేశారనే అనుమానం ఉందని, ప్రైవేటు వ్యక్తులతో ఆక్రమించుకొని భయపెడుతున్నారని మోహన్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు. 78 ఏళ్ల సీనియర్ సిటీజనైన తనకు అదనపు భద్రత కల్పించాలని, తన ఇంట్లో అనధికారికంగా ఉంటున్న మనోజ్, మౌనికలను పంపించాలని, తన ఇంట్లో ఎలాంటి భయం లేకుండా జీవించేందుకు రక్షణ కల్పించాలని మోహన్ బాబు రాచకొండ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు



# కేజ్రీవాల్ దూకుడు

**మహా:** వచ్చే ఏడాది ఫిబ్రవరి మార్చిలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 20 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను సోమవారం ప్రకటించారు. గత నెలలో 11 మందితో మొదటి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజా జాబితాలో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సహా పలు కీలక నేతలు రెండో జాబితాలో ఉన్నారు. ప్రస్తుతం ప్రతాపర్‌గంజ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న మనీశ్ సిసోడియాకు జంగ్‌పుర నుంచి బరిలోకి దిగుతున్నారు. అవద్ ఓజాను ప్రతాపర్‌గంజ్ సీటు కేటాయించారు. రెండు జాబితాల్లో 31 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. మరో 39 సీట్లకు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

# బంగ్లాదేశ్ నేతల వ్యాఖ్యలు

## తీవ్రంగా స్పందించిన మమతా బెనర్జీ

**విదేశీ శక్తులు ఆక్రమిస్తే భారతీయులు లాలీపాప్ తింటూ కూర్చుంటారా అని చురక**

**కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా బెంగాల్ కట్టుబడి ఉంటుందని వ్యాఖ్య**

**రెచ్చగొట్టే ప్రకటనలకు స్పందించాల్సిన అవసరం లేదన్న మమత**

**కోల్ కతా, మహా :** పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశాలపై తమకు హక్కు ఉందంటూ బంగ్లాదేశ్ నేతలు చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. విదేశీ శక్తులు ఆక్రమిస్తే భారతీయులేమైనా లాలీపాప్ తింటూ కూర్చుంటారా? అని చురక అంటించారు. ఇలాంటి వ్యవహారాల్లో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పశ్చిమ బెంగాల్ కట్టుబడి ఉంటుందన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మాట్లాడిన మమత బంగ్లాదేశ్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. బంగ్లాదేశ్‌లో కొందరు చేసే రెచ్చగొట్టే ప్రకటనలకు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. సంయమనం పాటిస్తూ ప్రశాంతంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు



విజ్ఞప్తి చేశారు. మన దేశ విదేశాంగ కార్యదర్శి ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఉన్నారని, అనవసరంగా ఇక్కడి వారు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులు, అక్కడి నేతల వ్యాఖ్యలను బెంగాల్‌లోని ఇమామ్‌లు కూడా ఖండిస్తున్నట్లు చెప్పారు. అక్కడ పరిస్థితులు మరింత దిగజారితే అక్కడి మన బంధువులు, మిత్రులపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఏదైనా మాట్లాడితే సంయమనం పాటించాలన్నారు. పరిస్థితులు దిగజారకుండా చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశాలపై తమ దేశానికి హక్కులు ఉన్నాయని ఇటీవల ఢాకాలో ఏర్పాటు చేసిన సభలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇది చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేష్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన భారత ప్రభుత్వం ఆ దేశ తీరును ప్రపంచ దేశాలు గుర్తెరిగేలా చర్యలు తీసుకంటుంది. మరో పక్క విదేశాంగ శాఖ కార్యదర్శి బంగ్లాదేశ్ వెళ్ళి అక్కడి ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు, గత కొద్ది రోజులుగా బంగ్లాదేశ్ లో మైనారిటీలపై దాడులు తీవ్రమవడంతో ఫాటు ఇస్కాన్ గురువును అరెస్టు చేయడంపై అక్కడి అధికారులతో మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ నేతలు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

## ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను

# సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.**




**ములుగు, మహా :** ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి. అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్ లతో కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్ కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రెవిన్యూ శాఖ 13, పెన్షన్లు 1 ఇందిరమ్మ ఇండ్లు 5, ఉద్యోగ ఉపాధి కొరకు 2, ఇతర శాఖలకు సంబంధించినవి 14, మొత్తం 35 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమావేశ మందిరంలోనే అందించారు. ఈ కార్యక్రమంలో సి పి ఓ ప్రకాష్, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సి కార్పొరేషన్ ఈ డి తుల రవి, డి సి ఎస్ ఓ షా ఫైజల్ హుస్సేనీ, డి ఎం డిసీఎస్ఓ రాం పతి, ఏ టి డి ఓ దేశిరాం, డి డబ్లుఓ ఇంచార్జీ శిరీష, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దట్టమైన అడవుల్లో శివాలయం

## ఘనంగా కైలాష్ టేకిడి 22వ వార్షికోత్సవం

**దర్శనం కోసం తరలివచ్చిన భక్తజనం**



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల ప్రముఖ శైవ క్షేత్రం కైలాష్ టెకిడి లో భక్తుల సందడి నెలకొంది. ఆలయ 22 వ వార్షికోత్సవం సందర్భంగా ఐదు రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు తెలంగాణ నుండే కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ నుండి భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లింబాజీ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఐదు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పరమశివుణ్ణి కొలుస్తున్నారు భక్తులు. గత 22 సంవత్సరాల నుండి కొందరు భక్తులు క్రమం తప్పకుండా వస్తూ ఉండడం విశేషం. కొండ కోనల్లో కొలువైన ఈ ఆలయానికి రావడం అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు చెబుతుంటారు. ఆ పరమశివుని ఆశీర్వాదం వలన ప్రజలు అందరు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉంటారని ఆలయ ప్రధాన్ లింబాజీ మహారాజ్ ఆకాంక్షించారు.

# రిమ్స్‌లో విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించిన కలెక్టర్



**ఆదిలాబాద్ మహా :** వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతోపాటు ఆదాయ మార్గాలను పెంచుకుని విజయ డెయిరీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య సౌజన్యంతో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్వయంగా కలెక్టర్ రాజర్షిషా పాల ఉత్పత్తులను కొనుగోలు చేసి మొదటి గిరాకీ చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపారం వృద్ధిలోకి రావాలని, ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు. ఇటువంటి మంచి ఆలోచన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ అధికారి మధుసూదన్ ,రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెంటెండ్ డాక్టర్ అశోక్ నిర్వాహకులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



**ఆదిలాబాద్ మహా :** సైబర్ నేరగాళ్ల మోసాలకు గురయిన వాళ్లు వెంటనే టోల్ ఫ్రీ సైబర్ క్రైమ్ నెంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే, పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు నూతన సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో ప్రారంభించారు. ముందుగా సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని ప్రారంభానికి విచ్చేసిన జిల్లా ఎస్పీకి ఆదిలాబాద్ సైబర్ డి.ఎస్.పి హసీబుల్ల పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కార్యాలయాన్ని అత్యధిక సదుపాయాలతో, నూతన పరికరాలను అందజేసి సైబర్ బాధితులకు వెంటనే న్యాయం చేకూరే విధంగా శిక్షణను తీసుకున్న నిష్ణాతులు సిబ్బందితో ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుత దేశంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను వినియోగించుకుంటూ ప్రజలను మోసం చేయడం జరుగుతుందని వాటి బారిన పడకుండా సైబర్ క్రైమ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్య పరుస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా టోల్ ఫ్రీ సైబర్ క్రైమ్ నెంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బు పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేసినట్లయితే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టే అవకాశం ఉన్నందున అతి త్వరగా స్పందించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో సైబర్ బారిన పడి నష్టపోయిన 90 మంది బాధితుల రూ 17,62,381/ రూపాయలను తిరిగి వారికి న్యాయశాఖ సహకారంతో అందజేసినట్లు తెలిపారు. సైబర్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఫిర్యాదులనైనా తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా శిక్షణను తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వయోవృద్ధులు, ప్రజలు, విద్యార్థులు సైబర్ నేరగాళ్ల చే మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా ఫ్రాడ్స్, బ్యాంకు ఫ్రాడ్స్, అశ్లీల చిత్రాలను పోస్ట్ చేస్తామంటూ వివిధ రకాలైన పద్ధతులలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఉంటారని వారి చేతిలో మోసపోకుండా వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ కు గాని సైబర్ క్రైమ్ వెబ్ సైట్ ను గాని సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, హసీబుల్లా, పోలీసు కార్యాలయం ఏవో భక్త ప్రహ్లాద్, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, ఇన్స్పెక్టర్లు డి సాయినాథ్, కరుణాకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్ సైబర్ క్రైమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకూడదు

## అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

**ఆదిలాబాద్ మహా :** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా క్షుణ్ణంగా పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపాలని,ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన అర్జీదారుల నుండి ఆర్డీఓ వినోద్ కుమార్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 78 అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించారు.



గ్రీవెన్స్ లో ఆర్డీవో వినోద్ కుమార్, జడ్పి సీఈఓ జితేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 హాల్ టికెట్స్ విడుదల

**హైదరాబాద్, మహా :** ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించబోయే గ్రూప్-2 రాతపరీక్షలకు సంబంధించి హాల్ టికెట్స్ విడుదలయ్యాయి. గ్రూప్-2 హాల్ టికెట్లు నేటి నుంచి 15వ తేదీ ఉదయం 9 గంటల వరకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నాయి. టీజీపీఎస్సీ ఐడీ, పుట్టిన తేదీతో అభ్యర్థులు హాల్ టికెట్స్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

# సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా స్వెట్టర్ల పంపిణీ

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా సోనాల మండల కేంద్రం లో యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్, కేక్ కట్ చేసి గాజుల పోతన్నతో కలిసి 100 మంది వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతు సోనియమ్మ తెలంగాణ ప్రదాతా అని తెలంగాణ ప్రజల కోరిక మేరకు నాడు పార్లమెంటులో బిల్లు పెట్టి తెలంగాణ ప్రజల కోరికను సాకారం చేసిందని కొనియాడారు. అదే విధంగా గాజుల పోతన్న గత కొన్ని సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూన్నారని వృద్ధులకు స్వెట్టర్లు పంపిణీ చేయడం చాలా సంతోషం అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు కార్యక్రమంలో సోనాల పట్టణ అధ్యక్షులు చెట్లపెల్లి



అనిల్ , సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల అరుణ రెడ్డి, సీనియర్ నాయకులు, విజయభాస్కర్ రెడ్డి, కసిరే పోతున్న , రామయ్ రాము, శ్రీధర్, సత్యనారాయణ, రాజేష్, ఇసురు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# జాన్సన్ నాయక్ కు పంటల గురించి ఏం తెలుసు

## పొనకల్ పీఏసీఎస్ అధ్యక్షుడు రవి విమర్శలు

**మంచిర్యాల మహా :** రైతుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ కు అసలు పంటల గురించి ఏం తెలుసునని పొనకల్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు అల్లం రవి విమర్శించారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ లోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవరూ అదైర్యపడవద్దని తెలిపారు. ఎమ్మెల్యే తో మాట్లాడి అకాల వర్షం కారణంగా తడిచిన ధాన్యం విషయంలో మీకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. కల్ల బొల్లి మాటలు చెప్పే జాన్సన్ నాయక్ ను పట్టించుకోవద్దన్నారు. అతనికి అసలు వరిపంట ఎన్ని రోజులకు చేతికొస్తుందో తెలియదన్నారు. రైతులపై లేని ప్రేమను ఒలక బోస్తూ వారిని అయోమయం లో పడేస్తున్నారన్నారు. రాజకీయ లబ్ది కోసం రైతులను భయభ్రాంతులకు గురి చేయాలనే ఒకే ఉద్దేశంతో జన్నారం లో పర్యటించాడని విమర్శించారు.



జాన్సన్ నాయక్ కు కేటీఆర్ దోస్త్ అనే అర్హత తప్ప ఖానాపూర్ నియోజకవర్గం లో తిరిగే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పార్టీ అని కడెం మరమ్మత్తులు చేసి సాగునీటి సమస్య పరిష్కారం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం పై బురుద జల్లాలని చూస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు.

# సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిషేక్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 9 మహా:** మండల కార్యాలయంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు. యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మస్కు నర్సింహా, బట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మల్ రెడ్డి అభిషేక్ సమక్షంలో సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ పోరాటంలో తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానాలను చూసి చెల్లించిన సోనియా గాంధీ, తెలంగాణ ప్రజల ఆశయం, ఆకాంక్షను గుర్తించి తెలంగాణ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని అన్నారు. నాడు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో ప్రజలను, రైతులను పలకరించిన పాపాన పోలేదు, తెలంగాణ ఉద్యమంలో పోరాడి అసువులు బాసిన కుటుంబాలను పట్టించుకున్న పరిస్థితి లేదు. సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి ఘనత గత ప్రభుత్వానిదని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రగతి పదంలో ముందుకు వెళ్తూ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేదు కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశంతో మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజల యొక్క ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంకాల దాస్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ సభ్యులు మస్కు నర్సింహా గులాబ్ అక్బర్ యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొలమాని రామకృష్ణ యాచారం మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయ ప్రకాష్ తెలంగాణ ప్రదేశ్ కమిటీ యాచారం మండలం సేవాదళ్ అధ్యక్షులు పూజారి రాకేష్ కుమార్ మాజీ వైస్ ఎంపీపీ దెంది రామిరెడ్డి మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌరారం వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి భాస్కర్ గౌడ్ గుండ్లపల్లి మురళి అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావడం జరిగింది




# ఏజెన్సీలో అక్రమ ఇసుక తవ్వకాలు

## పట్టించుకోని రెవెన్యూ టీఎస్ఎండిసి పిఓ మైనింగ్ ఏడి లు

### తక్షణమే బోర్ నర్సాపూర్ ఇసుక క్వారీని నిలిపివేయలి
### మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు డిమాండ్



**మంగపేట డిసెంబర్ 09, మహా:** మండలంలోని బోర్ నర్సాపూర్ రెవెన్యూ గ్రామంలో పట్టా భూములను ఇసుక మేట అని అక్రమంగా ఇచ్చిన ఇసుక తవ్వకాల పర్మిషన్ రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో 1957 మైనింగ్ యాక్ట్ ప్రకారం గ్రామసభ అనుమతి పొందిన తర్వాత ఇసుక అనుమతులు ఇవ్వాలని కానీ అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయని గిరిజనసంఘాలు ఆరోపిస్తున్నాయి. గౌరవ హై కోర్ట్ తీర్పుకు వ్యతిరేకంగా మంగపేట మండలంలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక క్వారీ నడుపుతున్నా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకొని గిరిజన ప్రాంతంలో ఖనిజ సంపద ను కాపాడాలని సోమవారం గ్రీవెన్స్ లో,ఐటీడీఏ పిఓ ను ప్రజావాణిలో మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ కమిటీ జిల్లా కలెక్టర్ ను కలిసి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ కమిటీ రాష్ట్ర నాయకులు ఈసం యాదయ్య, పోడెం శోభన్, అన్నబోయిన సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు ఈసం రాజు మరియు మండల కమిటీ కొమరం రవి, తోలేం నరసింహారావు ఆక తిరుమల రావు పూనేం రాములు, సౌలం సాయిబాబు, జార సాంబశివరావు, దొడ్డ విష్ణుమూర్తి, జబ్బ నరేష్, వజ్జా వరప్రసాద్, చీమల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు

# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు




**ఆదిలాబాద్ మహా :** పార్టీ కోసం పదవులను తృణప్రాయంగా త్యజించిన త్యాగమూర్తి సోనియా గాంధీ అని మాజీ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిగంబర్ రావు పాటిల్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని తమ అభిమాన నాయకురాలి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సెంటిమెంట్ గమనించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కొనియాడారు. ఆమె సూచనలు సలహాల కనుగుణంగా ప్రతీ నాయకుడు కార్యకర్త నడుచుకుంటూ కాంగ్రెస్ పార్టీ అనుకున్న లక్ష్యం వైపు ముందడుగు వేయాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,ఐ. ఎన్. టి. యూ. సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,కౌన్సిలర్లు బండారి సతీష్ ,సంద నర్సింగ్,యెల్మెల్వార్ రామ్ కుమార్,దర్శనాల లక్ష్మణ్,మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్, లోక ప్రవీణ్ రెడ్డి,మునిగెల విట్టల్, బొమ్మకంటి రమేష్,అల్చెట్టి నాగన్న,ఎస్.సి వింగ్ , పవార్ వసంత్,యెల్టి భోజా రెడ్డి,బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,మొహమ్మద్ రఫీక్, సుధాకర్ గౌడ్,బోనగిరి సంటన్న,దొగ్గలి రాజేశ్వర్,కొండూరి రవి,వామన్,శ్రీరామ్, సంతోష్, మోర ఆశన్న,రాహుల సోమన్న, షేక్ మన్సూర్,ఎల్మ రామ్ రెడ్డి,రాజా లింగన్న,ఓసావర్ సురేష్,మహేందర్, మహమూద్,ఆడే విట్టల్,అమృత్, సార్ల సత్యనారాయణ,పార్ల సురేష్,శ్రీకాంత్, సమీర్ అహ్మద్,అల్లాబకష్,మహిళా నాయకురాళ్లు దేశెట్టి ప్రభావతి,లత,సోనియా మంథని,శ్రీలేఖ ఆదివాసీ,నేరెళ్ల లక్ష్మి,మంథకిని,నల్వాల సుమ,షబానా,అఫ్రోజా తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు జిల్లా ప్రజలందరూ సహకరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు, మహా :** ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లా ప్రజలందరూ పాల్గొని సరియైన సమాచారం అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారంఒక ప్రకటనలో కోరారు. ప్రజా పాలన ఆరు గ్యారెం టీలలో భాగంగా 4వ గ్యారెంటీ అయిన ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వారి వివరాలను సేకరణను మొబైల్ యాప్ లో నమోదుకు సర్వే చేయబడు తుందనీ, జియో టాకింగ్ ఫోటో తీసుకోబడుతుందనీ, గతం లో ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ఇంటి స్థల ధ్రువీకరణ పత్రాలను, లబ్ధిదారుల



ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ వివరాలు, ఖచ్చితమైన సమాచారం అందించాల్సిందిగా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరా రు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎం పి డి ఓ లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని లేదా కలెక్టరేట్లోనీ కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 7109 ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



## ఆర్థిక అసమానతలతో ఎఫ్ఎంసీజీకి దెబ్బ

పట్టణాల్లో ఆర్థిక అసమానతల మధ్య అంతరం అంతకంతకు పెరుగుతున్నది. ఒకవైపు మధ్యతరగతి కుటుంబాలు తగ్గిపోతుండగా, మరోవైపు సంపన్న వర్గాలు అంతకంతకు పెరుగుతున్నారని నివేదిక వెల్లడించింది. 2019తో పోలిస్తే 2024లో సంపన్న వర్గాలు 86 శాతం మంది పెరగగా, ఇదే సమయంలో దిగువ, దిగువ మధ్యతరగతి కుటుంబాలు 25 శాతం తగ్గుముఖం పట్టారు. ఈ ప్రభావంతో ఎఫ్ఎంసీజీ రంగంపై తీవ్ర స్థాయిలోప్రభావం చూపుతున్నదని కాంతార ఇండియా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. లగ్జరీ, మధ్యతరగతి కుటుంబాల మధ్య పెరుగుతున్న అంతరంతో ఎఫ్ఎంసీజీ అమ్మకాలు భారీగా పడిపోయాయని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారి ఆదాయం తగ్గుముఖం పడుతుండటంతో వినియోగదారులు విశ్వాసం సన్నగిల్లుతున్నదని, దీంతో పట్టణ ప్రాంతాల్లో అమ్మకాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో సేల్స్ గణనీయంగా పడిపోయాయని ఇన్‌సైట్స్, దక్షిణాసియా ఎండీ సౌమ్య మోహంతీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే అమ్మకాలు గణనీయంగా తగ్గాయని దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజాలైన హెచ్‌యూఎల్, బ్రిటానియా, టాటా కన్జ్యూమర్ వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి.

## త్వరలోనే ఆపిల్ నుంచి మడత బెట్టేఫోన్ వచ్చేస్తోంది..!

మార్కెట్‌లో ఆపిల్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యంగా ఐఫోన్లకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో మొబైల్ కంపెనీలు ఫోల్డబుల్ ఫోన్లపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటి వరకు శామ్‌సంగ్, వన్‌ప్లస్ తదితర కంపెనీలు ఫోల్డబుల్ మొబైల్స్‌ని పరిచయం చేశాయి. ఆపిల్ మాత్రం ఫోల్డబుల్‌పై దృష్టి మాత్రం సారించలేదు. ప్రస్తుతం కంపెనీ ఫోల్డబుల్ మోడల్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. అయితే, కంపెనీ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఆపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని 2026 నాటికి లాంచ్ చేయనున్నదని ఓ నివేదిక తెలిపింది. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ గత కొద్దిరోజులుగా స్థిరమైన వృద్ధిని సాధించింది. ఈ రంగంలో శాంసంగ్, హువావే, మోటరోలా తదితర ప్రధాన కంపెనీలు ముందున్నాయి. శామ్‌సంగ్ జెడ్‌సిరీస్‌తో మార్కెట్‌లో ముందంజలో ఉన్నది. ప్రతి కొత్త వెర్షన్‌తో డిజైన్‌తో పాటు క్వాలిటీని సైతం మెరుగుపరుస్తూ వస్తున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేస్తుందన్న వార్త వినియోగదారుల్లో ఉత్సాహాన్ని పెంచింది. ఆపిల్ ఫోల్డబుల్ ఐఫోన్ మార్కెట్లో కొత్త అవకాశాలను తెరిచి, యూజర్లకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుందని నివేదిక పేర్కొంది. ఇటీవల



డీఎస్‌సీసీ (డిస్‌ప్లే సప్లై చైన్ కన్సల్టెంట్స్) నివేదిక 2019 నుంచి 2023 వరకు ప్రతి సంవత్సరం 40 వృద్ధి చెందుతున్న తర్వాత.. 2024లో మార్కెట్ కేవలం 5శాతం పెరుగుతుందని అంచనా వేస్తూ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ సవాళ్లను హైలైట్ చేసింది. 2024లో థర్డ్ క్వార్టర్‌లో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లేల డిమాండ్ సంవత్సరానికి 38శాతానికి తగ్గింది. ఫ్లెక్సిబుల్ ఓఎల్ఈడీ డిస్‌ప్లే మిలియన్ల సార్లు ఫోల్డ్ చేసినా ఎలాంటి నష్టం లేకుండా పని చేస్తుంది. ఆపిల్ కొత్త డిజైన్.. ప్రస్తుత ఐఫోన్ పీచర్స్, కొత్త ఫోల్డింగ్ మెకానిజానికి జోడించడం ద్వారా ఓ ప్రత్యేకమైన ఎక్స్‌పీరియన్స్ అందించనున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ అందుబాటులోకి వస్తే మార్కెట్‌పై భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆపిల్ ఉత్పత్తులు మార్కెట్లకు భారీగా డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే.

# బిలియనీర్స్ @ భారత్

**185 మందితో ప్రపంచ జాబితాలో మూడో స్థానం.. 2024లో 905 బిలియన్ డాలర్లకు సంపద**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 7:** శ్రీమంతులు అడ్డాగా భారత్ మారిపోతున్నది. ప్రతియేటా దేశవ్యాప్తంగా బిలియనీర్లు గణనీయంగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరానికిగాను భారత్‌లో 185 మంది ఆగర్భ శ్రీమంతులు ఉన్నట్లు యూబీఎస్ తన నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే సంపన్నవర్గాలు 21 శాతం మంది పెరిగారని, వీరి మొత్తం సంపద 905.6 బిలియన్ డాలర్లు లేదా రూ.75.19 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నదని పేర్కొంది. నికరంగా వీరి సంపద 42 శాతం ఎగబాకిందని తెలిపింది. ప్రపంచ దేశాల శ్రీమంతుల జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నదని వెల్లడించింది. 835 మందితో అమెరికా తొలిస్థానంలో నిలువగా, ఆ తర్వాతి స్థానంలో చైనా 427 మంది ఉన్నట్లు యూబీఎస్ తన తాజా బిలియనీర్ల నివేదికలో తెలిపింది. ప్రస్తుత సంవత్సరంలో కొత్తగా 32 మంది బిలియనీర్ల జాబితాలోకి చేరారని తెలిపింది. 2015 నుంచి శ్రీమంతుల సంఖ్య 123 శాతం చొప్పున పెరగడం విశేషం. కుటుంబ వ్యాపారాలు వారీ సంపద పెరగడానికి కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా భారత్‌లో ఇంచుమించు అన్ని వ్యాపారాల్లో కుటుంబ బిజినెస్‌లు అధికంగా ఉన్నాయని వెల్లడించింది.

### చైనాలో తగ్గుముఖం

అగ్రగామి దేశాలైన అమెరికా, భారత్‌లో బిలియనీర్లు పెరుగుతుండగా, అదే చైనాలో మాత్రం తగ్గుముఖం పడుతున్నారు. చైనాలో కుబేరుల సంఖ్య 93 మంది తగ్గారని నివేదిక పేర్కొంది. మొత్తం సంపద 1.8 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.4 ట్రిలియన్ డాలర్లకు పడిపోయింది. కానీ, అమెరికాలో బిలియనీర్ల సంపద 4.6 ట్రిలియన్ డాలర్ల నుంచి 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. మరోవైపు, 2015లో అంతర్జాతీయంగా 1,757 మంది బిలియనీర్లు ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 2,682కి చేరుకున్నారు. మొత్తంగా వీరి సంపద 6.3 ట్రిలియన్ డాలర్ల నుంచి 14 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2015 నుంచి 2020 వరకు బిలియనీర్ల సంపద 10 శాతం పెరగగా, 2020 నుంచి ఒక్క శాతానికి పరిమితమైందని తెలిపింది. గడిచిన పదేండ్లలో టెక్ బిలియనీర్లు భారీగా సంపదను సృష్టించారని, 2015లో 788.9 బిలియన్ డాలర్లుగా ఉన్న వీరి సంపద, 2024 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, ఫిన్‌టెక్, 3డీ ప్రింటింగ్, రోబోటిక్స్ వంటి విభాగాలు దూసుకుపోవడం వీరికి కలిసొచ్చింది. అలాగే పారిశ్రామికవేత్తల సంపద కూడా 480.4 బిలియన్ డాలర్ల నుంచి 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, రియల్ ఎస్టేట్‌కు చెందిన కుబేరుల సంపద కూడా 534 బిలియన్ డాలర్ల నుంచి 692.3 బిలియన్ డాలర్లకు చేరింది.

## యూజర్లకు షాక్ ఇచ్చిన వాట్సాప్..!

**33 మొబైల్స్‌కు త్వరలో సర్వీసులు బంద్..!**

వాట్సాప్ యూజర్లకు షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పాత వర్షెన్ ఫోన్లకు వాట్సాప్ సేవలను నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో 33 ఫోన్లకు సైతం సర్వీసులను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ మోడల్స్‌లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు సేవలు నిలిచిపోతాయని పేర్కొంది. ఐఫోన్స్, హువావే, లెనెవో, ఎల్‌జీ, మోటరోలా, సామ్‌సంగ్, సోనీ కంపెనీలకు చెందిన మోడల్స్ ఉన్నాయి. మోటా యాజమాన్యంలోని మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఐఓఎస్ 15.1 కంటే పాత వెర్షన్లకు సపోర్ట్‌ని నిలిపివేయాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి iPhone 5s, iPhone 6, iPhone 6 Plus మోడల్స్‌లో ఇక వాట్సాప్ పని చేయదని వాట్సాప్ ట్రాకర్ వాబీటాఇన్ఫో (WABetaInfo) పేర్కొంది. వాట్సాప్ ఇకపై ఐఓఎస్ 15.1 కంటే పాత వెర్షన్‌లను మే 5న, 2025 నుంచి సపోర్ట్ ఇవ్వనున్నట్లు చెప్పింది. వాట్సాప్‌తో పాటు వాట్సాప్ బిజినెస్‌కి సైతం వర్తిస్తుందని తెలిపింది. ఐఓఎస్ వెర్షన్ యూజర్లు తప్పనిసరిగా కొత్త మొబైల్స్‌కి మారాలని సూచించింది. వాస్తవానికి, ఈ మోడల్స్‌లో సెక్యూరిటీ అప్‌డేట్స్ రావడం నిలిచిపోయింది. కంపెనీ ఆండ్రాయిడ్ 5.0 తర్వాత.. iOS 12 తర్వాతి ఓఎస్‌లో వాట్సాప్ సపోర్ట్ ఇస్తున్నది. ప్రస్తుతం ఆయా మోడల్స్ ఫోన్లు వాడేవారంతా తప్పనిసరిగా వాట్సాప్‌ని ఉపయోగించడానికి స్మార్ట్‌ఫోన్‌ను అప్‌గ్రేడ్ చేయడం తప్పనిసరి. లేకపోతే వాట్సాప్ ఇకపై పని చేయదని స్పష్టం చేసింది. ఈ మేరకు వాట్సాప్ ఆయా మోడల్స్ జాబితాను విడుదల చేసింది.




# క్రీడా వార్తలు | SPORTS NEWS

## రెండో టెస్టులో శ్రీలంకపై విజయం..

**డబ్ల్యూటీసీ ఆశలు పెంచుకున్న దక్షిణాఫ్రికా**

**గిబెరా:** శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 109 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో సిరీస్‌ను 20 తేడాతో సఫారీలు కైవసం చేసుకున్నారు. సెయింట్ జార్జ్ పార్క్‌లో జరిగిన మ్యాచ్ (SAvSL)లో 348 రన్స్ టార్గెట్‌లో లంక రెండో ఇన్నింగ్స్ చేపట్టింది. ఇవాళ అయిదో రోజు 143 రన్స్ చేయాల్సి ఉండగా, చివరి అయిదు వికెట్లను లంక త్వరగా కోల్పోయింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా, కుశాల్ మెండిస్ కొంత సేపు ప్రతిఘటించినా.. చివరకు శ్రీలంక 238 రన్స్ వద్ద లంచ్‌కు ముందే ఆలౌటైంది. స్పిన్నర్ కేశ్ మహారాజ్.. ఈ ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు తీశాడు. టెస్టుల్లో అయిదేసి వికెట్లు తీయడం అతనికి ఇది 11వసారి. సిరీస్‌ను కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా.. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో తన పొజిషన్ మెరుగుపరుచుకున్నది. 63.33 పాయింట్లతో ఐసీసీ స్టాండింగ్స్ లిస్టులో సౌతాఫ్రికా ప్రస్తుతం ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలుచున్నది.




## హోటల్ గదుల్లో కూర్చోవడం కాదు..

**రోహిత్, కోహ్లీలపై గవాస్కర్ ఘాటు వ్యాఖ్యలు**

బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్టు లో ఓడి సిరీస్‌ను 11 తో సమం అయ్యేలా చేసిన భారత పురుషుల క్రికెట్ జట్టుకు లెజెండరీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఘాటైన సందేశం ఇచ్చారు. హోటల్ గదుల్లో కూర్చుని సమయాన్ని వృథా చేయకుండా బయటికొచ్చి ప్రాక్టీస్ చేయాలని సీరియస్ కామెంట్ చేశారు. ఇకనైనా ఈ సిరీస్‌ను మూడు మ్యాచ్‌ల సిరీస్‌గా భావించి సీరియస్‌గా ఆడాలని హితవు పలికారు.

మూడు రోజులకే ముగిసిన రెండో టెస్టులో భారత్ ఏ కోశాన కూడా ఆస్ట్రేలియాకు సరైన పోటీ ఇవ్వలేకపోయింది. మ్యాచ్ ఆద్యంతం ఆస్ట్రేలియాదే పైచేయిగా సాగింది. దాంతో మూడో రోజు రెండో సెషన్‌లోనే మ్యాచ్ ముగిసింది. భారత్ నిర్దేశించిన 19 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ వికెట్ నష్టపోకుండా ఛేధించింది. భారత్ 10 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో సీనియర్ క్రికెటర్‌లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలపై గవాస్కర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

'ఇకనైనా ఈ సిరీస్‌ను మూడు టెస్టుల సిరీస్‌గా భావించి సీరియస్‌గా ఆడండి. ఇది ఐదు టెస్టుల సిరీస్ అనే సంగతి మర్చిపోండి. నేను టీమిండియాకు చెప్పదల్చుకున్నది ఏమిటంటే వచ్చే రెండు రోజులైనా బాగా ప్రాక్టీస్ చేయండి. ఈ రెండు రోజుల ప్రాక్టీస్ చాలా ముఖ్యం. ఈ రెండు రోజులు



హోటల్ రూమ్‌లో కూర్చోవడమో, లేదంటే ఎటైనా వెళ్లడమో చేయకండి. ఎందుకంటే మీరిక్కడికి క్రికెట్ ఆడటానికి వచ్చారు' అని గవాస్కర్ తన సందేశంలో పేర్కొన్నారు. 'మీరు రోజంతా ప్రాక్టీస్ చేయాల్సిన అవసరం లేదు. మీరు ఉదయంగానీ, మధ్యాహ్నం గానీ మీకు వీలైన ఒక సెషన్‌లో ప్రాక్టీస్ చేయవచ్చు. అంతేగానీ సమయం వృథా చేయకండి. ఐదు రోజులు మ్యాచ్ ఆడాలంటే ఆమాత్రం ప్రాక్టీస్ ఉండాలి' అని గవాస్కర్ సూచించారు. అంతేగాక భారత ఆటగాళ్ల పేలవమైన ఆటతీరువల్లే రెండో టెస్టులో ఓటమి ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. బ్యాటర్‌లుగానీ, బౌలర్‌లుగానీ ఏమాత్రం మంచి ప్రదర్శన ఇవ్వలేదని పెదవి విరిచారు. ఇప్పటికైనా ఆటగాళ్లు రిథమ్ అందుకోవాలని గవాస్కర్ అన్నారు. అందుకు రెండు రోజుల సమయం అదనంగా దొరికిందని చెప్పారు. రిథమ్ కోల్పోవడంవల్లే బ్యాటర్‌లు పరుగులు రాబట్టడంలో, బౌలర్‌లు వికెట్లు తీయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కెప్టెన్, కోచ్ కూడా ఆటగాళ్లకు ప్రాక్టీస్ విషయంలో ఆప్షన్‌లు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. అందరూ ప్రాక్టీస్ చేయాల్సిందే అన్నారు. కాగా సిరీస్‌లో భాగంగా మూడో టెస్టు బ్రిస్బేన్‌లో ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది.

## స్క్వాష్ చాంపియన్లు ద్వివేది, వశిష్ట్




**హైదరాబాద్ :** ఈనెల 6 నుంచి 8 మధ్య తెలంగాణ స్కాష్ రాకెట్స్ అసోసియేషన్, గేమ్ పాయింట్ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్కాష్ చాంపియన్‌షిప్ 2024 ఘనంగా ముగిసింది. మూడురోజుల పాటు హోరాహోరిగా జరిగిన ఈ పోటీలలో భాగంగా అండర్ 13, అండర్ 15, అండర్ 17 విభాగాల్లో యువ క్రీడాకారులు తమ సత్తాచాటగా పురుషులు, మహిళల విభాగాల్లోనూ ప్యాడ్లర్లు ఆకట్టుకున్నారు. అండర్ 13 బాలుర విభాగంలో పులి తనుజ్ రెడ్డి విజేతగా నిలవగా అండర్ 15 గర్ల్స్ విభాగంలో ఆర్య ద్వివేది టైటిల్ నెగ్గింది. అండర్ 17 బాయ్స్ కేటగిరీలో రాజ్‌వీర్ విజేతగా నిలిచాడు. మెన్స్ కేటగిరీలో కరుణ్ వశిష్ట్, ఉమెన్స్ కేటగిరీలో ద్వివేది ఫైనల్‌లో జయకేతనం ఎగురవేశారు.

## ఆధిక్యంలో గుకేశ్

**ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్**



సింగపూర్: ప్రతిష్టాత్మక చెస్ చాంపియన్‌షిప్‌లో గుకేశ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. డ్రాల పర్వం కొనసాగిన ఈ టోర్నీలో వరుసగా ఏడు గేమ్‌ల తర్వాత ఫలితం తేలింది. ఆదివారం ముగిసిన 11వ రౌండ్‌లో గుకేశ్ విజయం సాధించి 6 పాయింట్లతో ఆధిక్యంలోకి వచ్చాడు. డిఫెండింగ్ చాంపియన్ లిరెన్ 5 పాయింట్లతో ఉన్నాడు. గత గేమ్‌ల మాదిరిగా కాకుండా గుకేశ్ ఆదినుంచే దూకుడుగా ఆడి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. ఐదు ఎత్తుల తర్వాతే అతడు మ్యాచ్‌పై పట్టు సాధించాడు. ఆట ఆసాంతం అదే దూకుడును కొనసాగించిన ఈ చెన్నై కుర్రాడు.. 29వ ఎత్తుతో విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. మరో మూడు మ్యాచ్‌లు మిగిలున్న ఈ టోర్నీలో ఇంకో మ్యాచ్ గెలిస్తే చాంపియన్‌షిప్‌ను గుకేశ్ దాదాపు సొంతం చేసుకున్నట్టే!

## మా పెళ్లికి రండి..! సచిన్‌ను ఆహ్వానించిన పీవీ సింధు జంట..

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతోంది. ఈ నెలలో ఆమె హైదరాబాద్‌లో నివసించే వెంకట దత్త సాయితో ఏడు అడుగులు వేయబోతున్నది. 22న ఉదయపూర్‌లోని లేక్స్ నగరంలో వివాహం జరుగనున్నది. ఈ క్రమంలో ఆదివారం కాబోయే భర్తతో కలిసి భారత దిగ్గజ బ్యాట్స్‌మెన్ సచిన్ టెండూల్కర్‌ను కలిసింది. సింధు, వెంకట దత్త సాయి జోడీ లెజెండరీ ప్లేయర్‌ను తమ పెళ్లికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సచిన్ సోషల్ మీడియా వేదికగా ఫొటోను షేర్ చేశారు. త్వరలోనే వైవాహిక జీవితంలో అడుగుపెడుతున్న జంటకు వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లికి రావాలని ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపాడు. ఇద్దరూ జీవితాంతం అద్భుతమైన జ్ఞాపకాలతో ఆనందంగా ఉండాలని సచిన్ ఆకాంక్షించారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత, బ్యాడ్మింటన్ స్టార్ అయిన పీవీ సింధు పోసెడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్త సాయిని వివాహం చేసుకోనున్నది. డిసెంబర్ 20 నుంచి వివాహ వేడుకలు మొదలవనున్నాయి. 22న ఉదయ్‌పూర్‌లో వివాహం జరుగనున్నది. రెండు కుటుంబాలు 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు. రెండు కుటుంబాలకు మధ్య పరిచయం ఉండగా.. నెలరోజుల కిందట వివాహం నిశ్చయించారు. జనవరి నుంచి మళ్లీ పీవీ సింధు షెడ్యూల్ బిజీ ఉండనుండగా.. పెళ్లికి సాధ్యమయ్యే విండో ఇది మాత్రమేనని ఆమె తండ్రి పీవీ రమణ పేర్కొన్నారు. వచ్చే సీజన్‌కు ప్రాధాన్యతత నేపథ్యంలో సింధు తన శిక్షణను త్వరలో మొదలుపడుతుదని చెప్పారు.






# నాలుగు రోజుల్లో రూ.829 కోట్లు

## బాక్సాఫీస్‌పై పుష్పరాజ్ విధ్వంసం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పుష్ప ది రూల్' (Pushpa 2 The Rule) బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమా డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ టాక్‌తో కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఈ సందర్భంగా నాలుగో రోజు కలెక్షన్స్‌కు సంబంధించి అప్‌డేట్ ఇచ్చింది చిత్రబృందం. 'పుష్ప ది రూల్'(Pushpa 2 Collections) ప్రపంచవ్యాప్తంగా మొదటిరోజు రూ.294 కోట్ల వసూళ్లు రాబట్టిందని మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో రోజు ఏకంగా రూ.155 కోట్ల వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో రూ.449 కోట్ల కలెక్షన్స్ సాధించింది ఈ చిత్రం. అయితే మూడో రోజు శనివారం కావడంతో రూ.172 కోట్ల వసూళ్లను రాబట్టగా.. 3 రోజులకు కలిపి రూ.621 కోట్ల వసూళ్లను సాధించింది. తాజాగా ఆదివారం నాడు సునామీ సృష్టించింది ఈ చిత్రం నాలుగో రోజు ఏకంగా.. 208 కలెక్షన్స్ రాబట్టి మొత్తం ఇప్పటివరకు రూ.829 కోట్ల వసూళ్లను సాధించింది. మరో రెండు రోజుల్లో ఈ చిత్రం రూ.1000 కోట్లు క్రాస్ చేస్తుందని ట్రేడ్ వర్గాల అంచనా. ఇదిలావుంటే నార్త్‌లో కూడా తన సత్తా చూపిస్తున్నాడు పుష్ప రాజ్. మొదటి రోజు హిందీలో రూ.72 కోట్ల కలెక్షన్లు రాబట్టిన ఈ చిత్రం రెండో రోజు రూ.59 కోట్లు రాబట్టింది. ఇక మూడో రోజు అయితే ఏకంగా రూ.74 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో మొదటి రోజున సాధించిన రూ.72 కోట్ల కలెక్షన్లు అధిగమించి తన రికార్డును తానే తిరగరాశాడు అల్లు అర్జున్. అయితే ఆదివారం కూడా ఈ రికార్డులు బద్దలయ్యింది. ఆదివారం రోజున ఏకంగా రూ.86 కోట్ల వసూళ్లతో ప్రభంజనం సృష్టించాడు పుష్పరాజ్. దీంతో నాలుగు రోజుల్లోనే బాలీవుడ్‌లో రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టి చరిత్ర సృష్టించాడు.






# అలాంటి ప్రేమ మరొకటి లేదు..

## చైతూశోభిత పెళ్లి వేళ హాట్‌టాపిక్‌గా సమంత పోస్ట్‌లు

స్టార్ నటి సమంతతో విడాకుల అనంతరం అక్కినేని నాగచైతన్య కొత్త బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. మరోనటి శోభిత ధూళిపాళ్లతో ఏడడుగులు వేశారు. వీరి వివాహం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అయితే, వీరి వివాహం వేళ సమంత పెడుతున్న పోస్ట్‌లు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. నాలుగు రోజుల క్రితం అమ్మాయి, అబ్బాయి కుస్తీ పోటీలకు సంబంధించిన వీడియో షేర్ చేసిన సమంత.. తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు 'సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

# ఇదంతా నాన్న ఆశీర్వాదం

## నేను ఫిట్‌గా ఉండటానికి కారణం అదే: మీనాక్షి చౌదరి

'గడిచిన జీవితం అంతా చదువు, ఆటలతోనే సరిపోయింది. నిజానికి నా లైఫ్‌లో సరదాలు తక్కువే. చిన్నప్పట్నుంచీ క్రమశిక్షణతోనే పెరిగాను. నాన్న సోల్జర్ కావడంతో ఇల్లాంతా ఆర్మీ వాతావరణమే ఉండేది.' అంటూ చెప్పకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాల గురించి ఆమె మాట్లాడింది. 'నాన్నకు ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువ. అందుకే చిన్నప్పట్నుంచీ నన్ను స్పోర్ట్స్ వైపు నడిపించారు. నేను స్విమ్మింగ్, బ్యాట్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్‌ని.నా ఫిజిక్ ఫిట్‌గా ఉండటానికి కారణం అదే. నాన్న ద్వారా అబ్బిన ప్రపంచజ్ఞానం నన్ను మిస్ ఇండియాగా నిలబెట్టింది. హీరోయిన్ అవుతానని మాత్రం అస్సలు అనుకోలేదు. ఓ విధంగా ఇదంతా మా నాన్న ఆశీర్వాదం' అంటూ ఆనందం వెలిబుచ్చింది మీనాక్షి చౌదరి. వెంకటేశ్‌కి జోడీగా ఆమె నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.



# జానీ మాస్టర్‌కు బిగ్ షాక్..

## డ్యాన్సర్ అసోసియేషన్ నుంచి తొలగింపు..!

లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ మీద బయటకు వచ్చిన ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బిగ్ షాక్ తగిలింది. జానీను డ్యాన్సర్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నుంచి శాశ్వతంగా తొలగించినట్లు తెలుస్తుంది. తన మీద లైంగిక వేధింపుల ఆరోపణలు రానంతవరకు డ్యాన్సర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జానీ మాస్టర్ కొనసాగుతూ వచ్చాడు. ఎప్పుడైతే అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌ని లైంగికంగా వేధించాడనే ఆరోపణలు వచ్చాయో అప్పుడే ఆ పదవి నుంచి తొలగించాలని అసోసియేషన్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాజాగా ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా.. జోసెఫ్ ప్రకాశ్ విజయం సాధించారు. భారీ మెజారిటీతో విజయం సాధించిన ప్రకాష్ డ్యాన్సర్స్ అసోసియేషన్ కు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది అయిదోసారి. ఇక కొత్త పాలక వర్గం ఎన్నుకున్న అనంతరం జానీని ఈ అసోసియేషన్‌ను తొలగించరాని తెలుస్తుంది.




### రష్మిక మందన్నా

# ది గర్ల్ ఫ్రెండ్ టీజర్ రిలీజ్

యానిమల్, పుష్ప 2 ది రూల్ సినిమాలతో వరుస బ్లాక్ బస్టర్‌లు అందుకుంది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. అయితే ఈ సినిమాలు ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్ చేస్తుంది ఈ భామ. రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. నయనం నయనం కలిసే తరుణం.. ఎదనం పరుగై పెరిగే వేగం. నా కదిలే మనసుని అడిగా సాయం. ఇక మీదట నువ్వే దానికి గమ్యం అంటూ విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. స్టోరీ ఏం రివీల్ చేయకుండా టీజర్‌ను కట్ చేశారు మేకర్స్. ఇందులో రష్మిక బాయ్ ఫ్రెండ్‌గా దీక్షిత్ శెట్టి నటించబోతున్నాడు. గీత ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు.







# తల నుంచి కాలి వరకూ మొత్తం బంగారమే..

అక్కినేని నాగచైతన్య - శోభిత ధూళిపాళ్ల వివాహం గత వారం అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెట్‌లో ఈ జంట వివాహ బంధంతో ఒక్కటైంది. గ్రాండ్ వెడ్డింగ్‌కు సంబంధించిన ఫొటోలు సైతం ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఇక పెళ్లి వేడుకలో శోభిత ధరించిన నగలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల్లో భాగంగా శోభిత ధరించినవన్నీ నిజమైన బంగారు ఆభరణాలే అట. తల నుంచి కాలి వరకూ ఆమె వేసుకున్న ప్రతి నగా స్వచ్ఛమైన బంగారమే అని తెలిసింది. తలకు కట్టుకున్న సంప్రదాయ బాసింగం నుంచి వడ్డాణం, ముక్కెర, చేతి వంకీలు, గాజులు, మీనాకారి ఝుంకాలు, ఉంగరాల దాకా.. ఇలా ప్రతి ఒక్కటీ రూబీ, బంగారం, డైమండ్స్‌తో ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నట్లు తెలిసింది. పెళ్లిలో శోభిత ధరించి ఆభరణాలు.. దర్శకుడు మణిరత్నం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'పొన్నియిన్ సెల్వన్: I' చిత్రంలోని ఐశ్వర్య రాయ్, త్రిష ధరించిన నగలను గుర్తు చేస్తాయి. జీవితాంతం గుర్తుండిపోయేలా తన పెళ్లి ఆభరణాలను ప్రత్యేకంగా తయారు చేయించుకున్నట్లు తెలిసింది. ఇక తన జడను సౌత్ ఇండియన్ బ్రైడల్ ఆభరణాలతో అలంకరించుకుంది. తన బ్రైడల్ లుక్‌కు సంబంధించిన ఫొటోలను శోభిత సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ప్రస్తుతం ఆ ఫొటోలు నెట్టింట ఆకట్టుకుంటున్నాయి. వాటిపై మీరూ ఓ లుక్కేయండి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com